TELTEL/2015/66279

అగ్రనేత

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :149 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శుక్రవారం 09-08-2024 | పేజీలు:4 వెల: 2.00

## కార్పొరేట్ కంపెనీలు గ్రామాలకు తరలండి

హైదరాబాద్,వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కార్పొరేట్ కంపెనీలు తమ వంతు సహకారం అందించాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క పిలుపునిచ్చారు. చివరి వరుసలో వున్న వారి అభివృద్ధి కోసం సామాజిక బాధ్యతగా కంపెనీలు ముందుకు రావాలని కోరారు. ఒక్కో కార్పొరేట్ కంపెనీ..ఒక్కో గ్రామాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి పరచాలని సూచించారు. హైదరాబాద్ లోని ప్రజా భవన్ లో మంత్రి సీతక్క, serp ceo దివ్యా దేవరాజన్, ములుగు కలెక్టర్ దివాకర్ లతో ఐటీ దిగ్గజ కంపెనీలైన మైక్రోసాఫ్ట్, ఇన్ఫోసిస్, కాగ్నిజెంట్, క్వాల్కమ్, బోష్, గ్రాన్యుల్స్ ఇండియా, టీసీఎస్, ఉషా, నిర్మాన్ తదితర కంపెనీల ప్రతినిధులు బుధవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. మనతో పాటు చుట్టూ ఉన్న వాళ్లు సంతోషంగా ఉండాలన్న లక్ష్యంతో కార్పొరేట్ కంపెనీలు పని చేస్తే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్పొరేట్ కంపెనీలు ఒక్కో గ్రామాన్ని దత్తత తీసుకొని స్థానిక సమస్యలను పరిష్కరించడంతో పాటు ఉపాధి అవకాశాలను

# రేవంత్ పర్యటనలో కొనసాగుతున్న పెట్టుబడులు ప్రవాహం



డల్లాస్ :తెలంగాణలో పెట్టుబడులకు పేరొందిన కంపెనీలు ఆసక్తి ప్రదర్శిస్తున్నాయి. పెట్టుబడుల సమీకరణ లక్ష్యంగా అమెరికాలో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి బృందం వివిధ కంపెనీల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలతో సంప్రదింపులు జరుపుతోంది. హైదరాబాద్‌లోని జీనోమ్ వ్యాలీలో అత్యాధునిక ఇంజెక్టబుల్స్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి వివింట్ ఫార్మా కంపెనీ నేడు ముందుకొచ్చింది. రూ.400 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయబోయే ఈ కంపెనీ దాదాపు వెయ్యి మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి.అమెరికా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ , ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు నేతృత్వంలోని ప్రతినిధి బృందం వివింట్ కంపెనీ ప్రతినిధుల మధ్య జరిగిన చర్చల అనంతరం పెట్టుబడులకు సంబంధించి కీలక ప్రకటన చేశారు. ప్రస్తుతం జీనోమ్ వ్యాలీలో వివింట్ కంపెనీ ఆర్ అండ్ డీ కేంద్రం ఉంది. సుమారు రూ. 70 కోట్లతో నెలకొల్పిన ఈ సదుపాయాలతో పాటు అంతర్జాతీయ మార్కెట్‌లో విస్తరించేందుకు కంపెనీ ప్రణాళికలు రూపొందించింది. అందులో భాగంగా హైదరాబాద్ లో తన మొదటి తయారీ కర్మాగారాన్ని స్థాపించనుంది. జీనోమ్ వ్యాలీలో పెట్టుబడులకు వివింట్ ఫార్మా ముందుకు రావటంపై ముఖ్యమంత్రి సంతోషం వ్యక్తం చేశారు. లైఫ్ సైన్సెస్ రంగంలో కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని చెప్పారు. తెలంగాణలో అన్ని పరిశ్రమలకు అనుకూల వాతావరణం ఉందని, జీనోమ్ వ్యాలీ ఔషధ కంపెనీలను తప్పకుండా ఆకర్షిస్తుందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు.

ఛార్లెస్ స్క్వాబ్ టెక్నాలజీ డెవెలప్‌మెంట్ సెంటర్

ఫైనాన్షియల్ సర్వీసెస్ రంగంలో ప్రపంచంలో పేరొందిన చార్లెస్ స్క్వాబ్ కంపెనీ హైదరాబాద్ లో టెక్నాలజీ డెవలప్?మెంట్? సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. భారత్లోనే ఈ కంపెనీ నెలకొల్పే మొదటి సెంటర్ ఇదే కావటం విశేషం.డల్లాస్ లో ముఖ్యమంత్రి , మంత్రి శ్రీధర్ బాబు లు ఛార్లెస్ స్క్వాబ్ కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ లు డెన్నిస్ హెూవార్డ్ , రామ బొక్కా రథ్యంలో ప్రతినిధులు చర్చలు జరిపారు.ఈ సందర్భంగా టెక్నాలజీ అండ్ డెవెలప్?మెంట్? సెంటర్ ఏర్పాటుపై కీలక నిర్ణయాన్ని వెల్లడించారు. హైదరాబాద్‌లో ఈ కేంద్రం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం తగిన సహకారం అందిస్తుందని రేవంత్ రెడ్డి ఇచ్చారు. కంపెనీ కార్యకలాపాలను వేగవంతం చేసేందుకు అవసరమైన మార్గదర్శనం చేస్తామని చెప్పారు. తమ కంపెనీ విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతుకు కంపెనీ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటుకు ఛార్లెస్ స్క్వాబ్ తుది అనుమతుల కోసం వేచి చూస్తోంది. త్వరలోనే తమ ప్రతినిధి బృందాన్ని హైదరాబాద్‌కు పంపించనున్నట్లు తెలిపింది. ఈ కంపెనీ విస్తరణతో ఆర్థిక సేవల రంగంలోనూ హైదరాబాద్ ప్రపంచం దృష్టిని ఆకర్షించనుంది.

మహాత్మాగాంధీకి నివాళి

డల్లాస్ చేరుకున్న రేవంత్ నేడు అక్కడ ఒక సెంటర్ లో ఏర్పాటు చేసిన మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల సమర్పించి నివాళులు అర్పించారు. ఆయన మంత్రివర్గ సహచరులు .శ్రీధర్ బాబు, , కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి లు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

# ఉన్నమాట అంటే ఉలుకిపాటు ఎందుకు?




హైదరాబాద్ : కాంగ్రెస్ హయాంలో గ్రామ పంచాయతీలు తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతున్నాయని, పెండింగ్ బిల్లులు చెల్లించకుండా పారిశుద్ధ్య నిర్వహణ కూడా కష్టంగా మారిందని మేం చెబుతుంటే ప్రభుత్వం ఉలిక్కి పడుతున్నదని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. మేం పదేపదే అబద్ధం చెబుతున్నామని మంత్రి సీతక్క అంటున్నారా.. హరీశ్‌రావు మండిపడ్డారు.

ఏది అబద్ధం ?

ప్రభుత్వం 9వ నెలలో అడుగుపెడుతున్నపటికీ గ్రామ పంచాయతీలకు 9 పైసలు కూడా చెల్లించకపోవడం అబద్దమా?కేంద్రం ఉపాధి హామీ, హెల్త్ మిషన్ వంటి పథకాల కింద వచ్చిన రూ. 2100 కోట్ల నిధులను గ్రామాలకు ఇవ్వకుండా దారి మళ్ళించింది అబద్దమా? 15 ఆర్థిక సంఘం నుంచి వచ్చిన రూ. 500 కోట్ల నిధులను గ్రామ పంచాయతీలకు ఇవ్వకుండా ఆపింది అబద్దమా? మాజీ సర్పంచ్‌లు పెండింగ్ బిల్లుల కోసం ఛలో సచివాలయం పిలుపు నిస్తే వారిని పోలీస్ స్టేషనులో నిర్బంధించింది అబద్దమా? గ్రామ పంచాయతీలలో పారిశుద్ధ్యం అటకెక్కడం మేం చెప్పిన అబద్దమా? గ్రామాల్లో పారిశుద్ధ్య లోపంతో డెంగీ, మలేరియా వంటి సీజనల్ రోగాలు ప్రబలడం అబద్ధమా? రెండు నెలలుగా పారిశుద్ధ్య కార్మికుల జీతాలు చెల్లించకపోవడం అబద్ధమా? 8 నెలలుగా జడ్పీటీసీలు, ఎంపీటీసీలకు గౌరవ వేతనం ఇవ్వకపోవడం అబద్ధమా? బీఆర్ఎస్ హయాంలో గ్రామ పంచాయతీలకు నెలనెల రూ. 275 కోట్లు, సంవత్సరానికి రూ. 3,300 కోట్ల నిధులు విడుదల చేసింది నిజం కాదా? అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హరీశ్‌రావు సూటిగా ప్రశ్నించారు.ఈ ప్రభుత్వం వాస్తవాలను అంగీకరించకుండా, సమస్యలు పరిష్కరించకుండా ప్రతిపక్షాల గొంతు నొక్కడం సరికాదు. ఈ ఎనిమిది నెలల కాంగ్రెస్ పాలనలో గ్రామాలు పూర్తిగా నిర్లక్ష్యానికి సిద్ధమయ్యాయి పచ్చి నిజం. ప్రభుత్వం మేల్కొని గ్రామ పంచాయతీలకు వెంటనే నిధులు విడుదల చేయాలని కోరుతున్నాను అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# వయనాడ్‌లో 417కు చేరిన మృతుల సంఖ్య

న్యూఢిల్లీ,ఆగస్ట్8: ప్రకృతి సృష్టించిన బీభత్సంతో కేరళలో వయనాడ్ జిల్లా ఇప్పుడిప్పుడే తేరుకుంటోంది. ఆయినా వర్షభయం మాత్రం వున్నాదుతూనే ఉంది. ఈ క్రమంలో బాధిత ప్రజలను ఓదార్చి, విలయాన్ని నేరుగా చూడాలని ప్రధాని మోడీ నిర్ణయించారు. ఈ మేరకు శనివారం ఆయన వయనాడ్ జిల్లాలోని చూరల్మల, ముండక్క గ్రామాలు దారుణంగా దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ 10వ తేదీన.. శనివారం ఆయా గ్రామాల్లో పర్యటించనున్నారు. అలాగే నిరాశ్రయులు తలదాచుకున్న పునరావాస కేంద్రాలను సైతం ఆయన ఈ పర్యటనలో భాగంగా సందర్శించనున్నారు.వయనాడ్‌లో చోటు చేసుకున్న ఈ విపత్తును జాతీయ విపత్తుగా ప్రకటించాలని ప్రధాని నరేంద్ర మోదీకి లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతోపాటు కేరళ, కర్ణాటక, మహారాష్ట్రలకు చెందిన ఎంపీలు విజ్ఞప్తి చేసిన విషయం విదితమే. పర్యటన అనంతరం ప్రధాని ఎలాంటి నిర్ణయం ప్రకటిస్తారన్నది ఆసక్తిగా ఎదరు చూస్తున్నారు. వయనాడ్ జిల్లాలో భారీ వర్షాలు, వరదలు, కొండ చరియలు విరిగి పడడంతో మృతుల సంఖ్య 417కు చేరింది. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశముందని సమాచారం. అలాగే వందలాది మంది గల్లంతయ్యారు. వారి కోసం నేటికి గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. 10 వేల మందికి పైగా నిరాశ్రయులు వివిధ పునరావాస కేంద్రాల్లో తల దాచుకున్న సంగతి తెలిసిందే. ప్రధాని మోదీ శనివారం ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో కేరళ బయల్దేరి వెళ్తారు. అక్కడ కన్నూర్‌లో ల్యాండ్ అవుతారు. అక్కడి నుంచి కొండచరియలు విరిగిపడిన ప్రాంతానికి వెళ్లి అక్కడి పరిస్థితిని సమీక్షించనున్నారు. అనంతరం ప్రమాద బాధితుల్ని మోదీ పరామర్శించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వ వర్గాలు గురువారం వెల్లడించాయి. కాగా, వయనాడ్ ఘటనను జాతీయ విపత్తుగా ప్రకటించాలని విపక్షాలు డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. పరిహారం పెంచాలని, సమగ్ర పునరావాస ప్యాకేజీని ఇవ్వాలని ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఎంపీలు లోక్‌సభలో కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో మోదీ వయనాడ్ పర్యటకు ప్రాధాన్యత సంతరించుకుంది. గత నెల 30వ తేదీన భారీ వర్షాల కారణంగా వయనాడ్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో భారీగా కొండచరియలు విరిగిపడిన విషయం తెలిసిందే. ఈ ప్రకృతి విపత్తులో చూరాల్‌మాల్ పట్టణం పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. భారీగా ప్రాణ, ఆస్తి



నష్టం సంభవించింది. సుమారు 417 మంది ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. వందల సంఖ్యలో ప్రజలు గాయాలపాలయ్యారు. వారంతా ప్రస్తుతం వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. 10 వేల మందికిపైగా బాధితులు రిలీఫ్ సెంటర్లలో ఆశ్రయం పొందుతున్నారు. మరోవైపు బుధవారం లోక్‌సభలో జీరో అవర్‌లో వయనాడు అంశంపై వాడి వేడి చర్చ జరిగింది. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ.. వయనాడ్ ప్రజలకు నష్ట పరిహారం ప్రకటించాలని మోదీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విపత్తు సంభవించిన ప్రాంతాల్లో తాను పర్యటించానన్నారు. ఈ విపత్తులో మొత్తం కుటుంబం కుటుంబమే తుడుచు పెట్టుకుని పోయిందన్నారు. ఇక కొన్ని చోట్ల అయితే కుటుంబంలో ఒక్కరు మాత్రమే మిగిలారని చెప్పారు. అదీ కూడా ఇంట్లో పెద్ద వారు లేకుంటే చిన్నారుల్లో ఒక్కరే మిగిలి ఉన్నారని... ఇటువంటి ఘటనలు వయనాడ్ జిల్లాలో కోకొల్లలుగా ఉన్నాయని రాహుల్ గాంధీ ఈ సందర్భంగా వివరించారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు రాహుల్ గాంధీతోపాటు ప్రియాంక గాంధీ ఇటీవల వయనాడ్ జిల్లాలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఇంకోవైపు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఇటీవల కీలక ప్రకటన చేశారు. భారీ వర్షాలు, వరదలపై కేరళ ప్రభుత్వాన్ని ముందే హెచ్చరించామని చెప్పారు. కానీ కేరళ ప్రభుత్వం తమ హెచ్చరికలను బేఖాతరు చేసిందన్నారు. దీనిపై కేరళ సీఎం పినరయి విజయ్ స్పందించారు. మోదీ ప్రభుత్వం ఎటువంటి హెచ్చరికలు జారీ చేయలేదన్నారు. అమిత్ షా చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా కేరళ సీఎం ఖండించారు.

# బెంగాల్ మాజీ సిఎం..కమ్యూనిస్ట్ దిగ్గజం బుద్దదేవ్ భట్టాచార్య కన్నుమూత




కోల్‌కతా,ఆగస్ట్8: పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, కమ్యూనిస్టు శిఖరం బుద్ధదేవ్ భట్టాచార్జీ (80) తుదిశ్వాస విడిచారు. కొంతకాలంగా శ్వాసకోస సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ఆయన.. కోల్‌కతాలోని తన నివాసంలో కన్నుమూశారు. గతేడాది న్యుమోనియా సోకడంపాటు పలు అనారోగ్య సమస్యలు తలెత్తాయి. దీంతో తరుచూ ఆస్పత్రికి వెళ్లి వస్తుండేవారు. అయితే గురువారం నాడు ఒక్కసారిగా తీవ్ర అస్వస్థతకు లోనైన బుద్ధదేవ్ మృతిచెందారు. పెద్దాయన ఇకలేరన్న వార్తతో కుటుంబ సభ్యులు, అభిమానులు, సీపీఎం కార్యకర్తలు, నేతలు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. కాగా.. భట్టాచార్జీకి భార్య మీరా, కుమారుడు సుచేతన్ ఉన్నారు. మార్చి1, 1944న బెంగాలీ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన బుద్ధదేవ్.. కోల్‌కతాలోని ప్రెసిడెన్సీ కళాశాలలో ఉన్నత చదువులు చదివారు. బెంగాల్ సాహిత్యం చదివిన ఆయన.. ఉపాధ్యాయుడిగా కెరీర్ మొదలుపెట్టారు. ఇక ప్రజాసేవే లక్ష్యంగా 1966 రాజకీయాల్లోకి వచ్చి.. పలు ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్నారు. 1968లో జరిగిన వియత్నాం ఉద్యమానికి మద్దతు ఇచ్చారు. ఈ క్రమంలోనే.. 1968లో యువజన విభాగం అయిన డెమోక్రటిక్ యూత్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ప్రమోద్ దాస్‌గుప్తా.. బుద్ధదేవ్‌కు గురువు అని చెప్పుకుంటూ ఉంటారు. 1977లో కాశీపూర్-బెల్గాచియా నియోజకవర్గం నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచారు. మొదటిసారే గెలవడమే కాదు.. సమాచార శాఖా మంత్రిగా పదవి కూడా దక్కించుకున్నారు. 1982లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కోసిపూర్ నియోజకవర్గం నుంచి 1982లో స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఆ తర్వాత.. 1984లో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. 1987లో జాదవ్‌పూర్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఈసారి కూడా.. మొదటిసారి మాదిరిగానే సమాచార శాఖ మంత్రిగా పనిచేశారు. 1991లో సమాచార శాఖతో పాటు సాంస్కృతిక వ్యవహారాలు, పట్టణాభివృద్ధి, మునిసిపల్ వ్యవహారాల శాఖలకు మంత్రిగా తన కర్తవ్యాలను నిర్వర్తించారు. అలా పార్టీకి విధేయుడిగా ఉండటంతో పాటు.. పోటీచేసిన నియోజకవర్గానికే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఈయనపైన అవినీతి ఆరోపణలు కూడా ఉన్నాయని అప్పట్లో పెద్ద చర్చే జరగడం.. కొన్ని నెలల వ్యవధిలోనే తిరిగి జ్యోతిబసు మంత్రివర్గంలో చేరారు. 1996 ఎన్నికల్లో గెలిచిన తర్వాత జ్యోతిబసుకు అనారోగ్యంతో బాధపడుతుండటంతో నాడు సీనియర్‌గా ఉన్న భట్టాచార్జీకి డిప్యూటీ సీఎం, హోం శాఖ కూడా బాధ్యతలు కూడా అప్పగించారు. 2000లో బసు రాజకీయాలకు దూరమైన తర్వాత బుద్ధదేవ్ దశ తిరిగింది. ఆ తర్వాత పార్టీకి అన్నీ తానై 2001 ఎన్నికల్లో పార్టీని గెలిపించి.. తొలిసారి ముఖ్యమంత్రి అయ్యారు. ఆ తర్వాత జరిగిన 2006 అసెంబ్లీ ఎన్నికల్లోనూ సీపీఎం గెలుపులో ప్రధానపాత్ర పోషించారు. దీంతో రెండోసారి సీఎంగా ఎన్నికయ్యారు. అలా.. జ్యోతిబసు తర్వాత ముఖ్యమంత్రిగా మంచి పేరు సంపాదించుకున్న భట్టాచార్జీ.. నాడు తీసుకున్న కొన్ని నిర్ణయాలు, సంస్కరణ లతో పార్టీ ఓటమిని చవిచూసింది. రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయినప్పటికీ సాధారణ జీవితాన్నే గడుపుతూ వచ్చారు. బాలీగంజ్‌లోని చిన్న ఇంట్లోనే నివసించడం, సీఎంగా కూడా ఇక్కడ్నుంచే విధులు నిర్వర్తించడం ఈయన ప్రత్యేకత. ఆఖరికి అదే ఇంటిలోనే తుదిశ్వాస కూడా విడిచారు. సాధారణ కార్యకర్తతో మొదలైన ఆయన జీవితం పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యే వరకూ వెళ్లింది. రెండు దఫాలుగా సీఎంగా పనిచేసిన భట్టాచార్జీ రాష్ట్ర రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. జ్యోతిబసు తర్వాత రాష్ట్ర రాజకీయాల్లోనే కాదు.. జాతీయ రాజకీయాల్లోనూ ఈయన పేరు ఎక్కువగా వినిపించేది. 34 ఏళ్ల పాటు పశ్చిమ బెంగాల్ కమ్యూనిస్ట్ పాలన సాగగా.. ఇందులో బుద్ధదేవ్ పాత్ర కీలకం. మమతాబెనర్జీ నేతృత్వంలోని తృణముల్ కాంగ్రెస్ చారిత్రాత్మక విజయం సాధించినప్పుడు 2011 ఎన్నికల్లో భట్టాచార్జీ సీపీఎంకు అన్నీ తానై ముందుకు నడిపించారు. ఈయన హయాంలో జరిగిన సింగూర్ టాటా నానో వివాదం, నందిగ్రామ్ హింస ఎప్పటికీ రాష్ట్ర ప్రజలు మరిచిపోలేరని చెబుతుంటారు. ఇదిలా ఉంటే జనవరి 2022లో నాటి కేంద్ర మూడవ అత్యున్నత పౌర పురస్కారమైన పద్మభూషణ్‌ను అందించగా.. అవార్డును తిరస్కరించారు. ఆయన మృతకి కమ్యూనిస్ట్ నేతలు సతాపం ప్రకటించారు.

# సీఎం సిద్ధరామయ్యతో పవన్ కల్యాణ్ బేటి



బెంగళూరు : ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇవాళ కర్ణాటక సీఎం సిద్ధరామయ్యతో బెంగళూరులో సమావేశమయ్యారు. ఎపిలోని పార్వతీపురం, చిత్తూరు జిల్లాలో గ్రామాలలోకి ప్రవేశిస్తున్న చొరబడుతున్న ఏనుగులను ఆరికట్టే చర్యల నేపథ్యంలో పవన్ నేడు ఆ రాష్ట్ర అటవీ శాఖ మంత్రితో చర్చల కోసం నేడు అమరావతి నుంచి బెంగుళూరు వెళ్లారు.. ముందుగా పవన్ ముఖ్యమంత్రి సిద్దరామయ్య నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు.. అక్కడికి చేరుకున్న పవన్ ను ఆప్యాయంగా లొనికి ఆహ్వానించారు సిద్దరామయ్య.. ఇరువురు కొంత సేపు రాజకీయాలపై చర్చించారు.. అనంతరం ఏనుగులు సమస్యలను ప్రస్తావించారు పవన్.. దీనిపై అటవీ శాఖ మంత్రి ఈశ్వర్ బీ ఖంద్రేతో చర్చించలసిందిగా కోరారు.అనంతరం పవన్ మంత్రి ఈశ్వర్ తో భేటి అయ్యారు. చిత్తూరు జిల్లా పరిధిలో, పార్వతీపురం ప్రాంతంలోను ఏనుగులు గ్రామాల్లోకి వస్తూ పంటలు నాశనం చేస్తున్నాయని, అలాగే, స్థానికులకు ఏనుగులు ప్రాణ హాని కలిగిస్తున్నాయి మంత్రి దృష్టికి తెచ్చారు.. ఆ ఏనుగులను తిరిగి అడవిలోకి తరిమేందుకు కుంకీ ఏనుగులు అవసరమవుతాయన్నారు. కర్ణాటకలో కుంకీ ఏనుగులు ఉండడంతో కొన్నింటిని తమ రాష్టానికి పంపాలని కర్ణాటక అటవీ శాఖ మంత్రిని పవన్ కల్యాణ్ కోరారు.కుంకి ఏనుగుల మనుగడతో పాటు వాటి జీవన విధానంలో మార్పుపై పవన్ కూడా ఆయనతో చర్చించారు. అలాగే, ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టడానికి ఇరు రాష్ట్రాల అధికారులు సమన్వయంతో పని చేసేలా కార్యాచరణ రూపొందించుకునే అంశంపై కూడా పవన్ కల్యాణ్ సుదీర్ఘ చర్చలు జరిపారు.. ఇరు రాష్ట్రాలు అక్రమ రవాణ వివరాలను, వాటిని స్మగ్లింగ్ చేసే వారి సమాచారాన్ని ఇచ్చి పుచ్చుకోవాలని నిర్ణయించారు..

# ఏపీలో కొత్త మద్యం పాలసీ పర్మిట్ రూమ్స్ పై కీలక నిర్ణయం!!



అమరావతి,ఏపీలో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల ప్రాణాలు హరించే కల్తీ మద్యం బ్రాండ్ల నుంచి విముక్తి కలిగించింది.. నాణ్యమైన మద్యాన్ని తక్కువ ధరకే అందిస్తామని చంద్రబాబు ఎన్నికల ప్రచార సమయంలో హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. నాడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం ఆ దిశగా అడుగులు ప్రారంభించింది. ఏపీలో "కొత్త" మద్యం పాలసీని తీసుకురానుంది.అవును... గత ప్రభుత్వ హయాంలో గతంలో ఎన్నడూ కననీ, విననీ బ్రాండ్స్ మద్యం లిక్కర్ షాపుల్లో ఏపీ దర్శనమిచ్చిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఆ మద్యం బ్రాండ్ పేర్లపై వైసీపీని బాగా ట్రోల్స్ చేసేవారు కూడా. ప్రధానంగా... బూమ్ బూమ్, ప్రెసిడెంట్ మెడల్, పవర్ స్టార్, రాయల్ 'ప్యాలెస్' మొదలైన మద్యం బ్రాండ్స్ పై ట్రోలింగ్ జరిగింది. అయితే సర్కార్ ఈ విషయంలో కీలక నిర్ణయం కూటమి తీసుకుంది.ఇందులో భాగంగా అక్టోబర్ 1 నుంచి ఏపీలో నూతన మద్యం పాలసీని తీసుకురానున్నారు. ఈ సందర్భంగా స్పందించిన మంత్రి కొల్లు రవీంద్ర ఈ విషయాలు. ఈ సందర్భంగా... గతంలో ఉన్న నాణ్యమైన మద్యం బ్రాండ్ అందుబాటులోకి తెచ్చేందుకు అధిక ప్రాధాన్యతనిచ్చింది. దీంతో... కచ్చితంగా ధరలు కూడా తగ్గే అవకాశం ఉందని మద్యపాన ప్రియులు.ఇదే సమయంలో... ఈ విధానం ప్రకారం ప్రస్తుతం ఉన్న అన్ని ప్రభుత్వ మద్యం కొత్త వాహనాలను మూసివేసి ప్రైవేట్ వ్యాపారాలకు అప్పగించినట్లు చెబుతున్నారు. అదేవిధంగా... ప్రస్తుతం ప్రైవేటు వెండర్ల కింద ఉన్న నేపథ్యంలో.. వీటి లైసెన్సులను డిసెంబర్ వరకూ పొడిగించే అవకాశం ఉంది. ఇదే కావాలంటే.. పర్మిట్ రూమ్ విధానం కూడా గ్రామస్థాయిల్లోనూ అందుబాటులోకి రానుందని అంటున్నారు.ప్రధానంగా పర్మిట్ రూమ్స్ లేకపోవడం వల్ల బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం ఇబ్బందిగా ఉండేదని మద్యపాన ప్రియులు వాపోయేవారు. దీనివల్ల గ్రామాల్లో తోటల్లోకి, చెట్ల కిందకు వెళ్లి మద్యం సేవించేవారు. అయితే ఇకపై ఆ ఇబ్బంది లేకుండా పర్మిట్ రూమ్ లకు ఈ సర్కార్ విరివిగా అనుమతి ఇచ్చే అవకాశం ఉందని అంటున్నారు.ఇదే సమయంలో ఉదయం 11 గంటల వరకూ వైన్ షాప్స్ ఓపెన్ చేయకపోవడం వల్ల బ్లాక్ మార్కెట్ ఎక్కువగా నడిచేదని.. అందుకే టైమింగ్స్ కూడా మార్చే ఆలోచన ఉందని చెబుతున్నారు. ఇదే... చీప్ లిక్కర్ ను పూర్తిగా ఎత్తేసి, కాస్త బ్రాండెడ్ మద్యాన్నే తక్కువ ధరకు అందించే అవకాశం ఉందని చెబుతున్నారు.గత ప్రభుత్వం రూ.60 ఉన్న మద్యాన్ని 150 నుంచి 200 రూపాయలకు విక్రయించిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలా సరికొత్త మార్పులతో... నూతన మద్యం పాలసీ అక్టోబర్ 1 నుంచి అమలులోకి రానుంది!

## సంపాదకీయం

శుక్రవారం 09-08-2024

# నియంతృత్వంపై తిరుగబాటు !

శ్రీలంక తరవాత ఇప్పుడు బంగ్లాదేశ్..ఈ రెండు దేశాలు ప్రపంచానికి ఓ పాఠం చెప్పాయి. నేతల నియంతృత్వ ధోరణలు..ప్రజల ఆకాంక్షలను పట్టించుకోని తీరును ప్రపంచానికి తెలియచేశాయి. చరిత్ర తిరగేస్తే..నియంతలకు స్థానం లేదని ఎప్పుడూ నిరూపిస్తూనే ఉంది. బంగ్లా ప్రధాని షేక్ హసీనా నియతృత్వ పోకడలు ఆమెనే గద్దె దించాయి. దేశ విముక్తి పోరాటంలో పాల్గొన్న వారికి రిజర్వేషన్ల పేరుతో తన పార్టీ వారికి లబ్ది చేకూర్చే విధంగా చేసిన యత్నాలు బెడిసికొట్టాయి. ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను గుర్తించకుండా మొండిగా, నిరంకుశంగా నిర్ణయాలు తీసుకున్నారు. బంగ్లా సుప్రీంకోర్టు రిజర్వేషన్ల కోటాను తగ్గించినా ప్రజల్లో ఆగ్రహం చల్లారలేదు. దీనికితోడు నేతు విలాసాలకు అలవాటు పడుతున్నారు. ప్రజల సొమ్ముతో జల్సాలు చేస్తున్నారు. ఇది ప్రజల్లో ఆగ్రహానికి కారణం అవుతోంది. అదే బంగ్లాదేశ్‌లో తిరుగు బాటుకు బీజం వేసింది. గత కొన్ని వారాలుగా బంగ్లాదేశ్‌లో వేగంగా మారుతున్న రాజకీయ పరిణామాలను పొరుగుదేశాలు, స్నేహితులు గమనిస్తున్నారు. బంగ్లాదేశ్ ప్రధానిగా సుదీర్ఘకాలం పనిచేసన షేక్ హసీనా గతంలో సంక్షోభాలను ఎదుర్కొన్నట్లుగానే ఈ సమస్యను కూడా పరిష్కరించగలరా అని అనుమానాలు వ్యక్తం అయ్యాయి. ఎందుకంటే పరిస్థితులు దిగజారుతున్నా పట్టించుకోకుండా ముందుకు వెళ్లారు. అందుకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పలేదు. బతుకుజీవుడా అంటే దేశం విడిచి పెట్టా పారిపోవాల్సి వచ్చింది. గతంలో శ్రీలంక ప్రధాని కూడా ఇలాగే పారిపోయారు. స్వేచ్ఛ, నిష్పక్షపాతమైన, విశ్వసనీ యమైన ఎన్నికల ద్వారా 2009లో షేకహేసీనా అధికారం చేపట్టారు. అయితే ఆ తర్వాత 2014, 2018 మరియు 2024లో ఎన్నికలు వివాదాస్పదమైనప్పటికీ.. అధికారాన్ని చేపట్టారు. తన తండ్రి షేక్ ముజ్బీర్ రహమాన్ ప్రతిష్టను అడ్డం పెట్టుకుని ఆమె రాజ్యమేలారు. అయితే దేశంలో అనూహ్యంగా రాజకీయ పరిణామాలు మారిపోయాయి. 15 ఏళ్ల సుదీర్ఘపాలనను ముగిస్తూ సోమవారం ఆమె ప్రధాని పదవికి రాజీనామా చేశారు. ఉద్యోగాల్లో కోటాను వ్యతిరేకిస్తూ శాంతియుతంగా ప్రారంభమైన విద్యార్థుల నిరసనలు వేగంగా దేశవ్యాప్త ఆందోళనలుగా మారాయి. స్వదేశంలో విదేశాలలో షేక్ హసీనా సాధించిన ఆర్థికాభి వృద్ధిని కప్పిపుచ్చుతూ, ఆమె నిరంకుశత్వం, అవినీతి, బంధుప్రీతిపై అంసతృప్తిని బహిర్గతం చేశాయి. ఓవైపు దేశంలో ప్రజాస్వామ్య విలువలు, పౌరహక్కులను హరించివేస్తూ, మరోవైపు ఆర్థిక పురోగతి సాధించినంత మాత్రాన ఆ నేత ప్రజాదరణను పొందలేరని ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. రిజర్వేషన్ల కోటాను వ్యతిరేకిస్తూ విద్యార్థులు చేపట్టిన శాంతియుత నిరసనలు, వివాదాస్పద రాజకీయ పరిణామాలుగా మారాయి. అయితే ఈ నిరసనలను అణచివేసేందుకు ఆమె సైన్యాన్ని రంగంలోకి దింపారు. దీనిపై ప్రజాగ్రహం పెల్లుబికింది. కర్ఫ్యూ, షూట్ ఎట్ సైట్ ఆదేశాలు, ఇంటర్నెట్‌పై నిషేధం ఉద్యమాలను మరింత ఉధృతం చేశాయి. ప్రదర్శనకారులను 'రజాకార్లు' అని హసీనా పేర్కొనడం ఉద్రిక్తతలను మరింత పెంచింది. ఈ ఉద్యమాలకు విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సామాజిక సంస్థలు సహా సమాజం లోని విభిన్న వర్గాలు మద్దతు ప్ర కటించాయి. తమ డిమాండ్లు నెరవేరేంతవరకు ప్రధానితో చర్చలకు విద్యార్థులు నిరాకరించారు.ప్రజాస్వామ్య విలువలు, పౌరహక్కులను తుంగలో తొక్కి కేవలం ఆర్థికాభివృద్ధికి మాత్రమే ప్రాధాన్యత నిచ్చే నేతలకు షేక్ హసీనా పతనం ఉదాహరణగా నిలిచింది. ఆమె తండ్రి జైలు శిక్ష అనుభవించినప్పటికీ దేశం విడిచి పారిపోలేదు. హసీనా నిష్క్రమణ బంగ్లాదేశ్ రాజకీయాల్లో గణనీయమైన మార్పును సూచిస్తుంది. హసీనా తన పదవికాలంలో లిఖించదగిన ఆర్థికాభివృద్ధి ని సాధించారు. ప్రపంచం లోనే అత్యంత పేదరిక దేశంగా ఉన్న బంగ్లాదేశ్ ..ఆమె హయాంలో ఆ ప్రాంతంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థికవ్యవస్థ గా రూపాంతరం చెందింది. పొరుగునే ఉన్న భారతదేశాన్ని కూడా అధిగమిం చింది. దశాబ్ద కాలంలో దేశ తలసరి ఆదాయం మూడింతలైంది. గడిచిన 20 ఏళ్లలో దేశంలో 25 మిలియన్లకు పైగా ప్రజలు పేదరికం నుండి బయటపడ్డారని ప్రపంచ బ్యాంకు అంచనా వేసింది. హసీనా ప్రభుత్వం దేశీయ నిధులు, రుణాలు అభివృద్ధి నిధుల సాయంతో గంగానదిపై 2.9 బిలియన్ డాలర్ల పద్మ వంతెనవంటి ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టులను చేపట్టారు. అయితే ఈ ఆర్థికాభివృద్ధి గణనీమైన ఖర్చుతో కూడుకుంది. దీంతో 2014, 2018 మరియు 2024లో జరిగిన పార్లమెంటరీ ఎన్నికలు తక్కువ ఓటింగ్, హింస, ప్రతిపక్ష పార్టీల బహిష్కరణల మధ్య జరిగాయి. భయం,అణచివేత వాతావరణాన్ని సృష్టించి, నియంత్రణను కొనసాగించడానికి హసీనా ప్రభుత్వం పూర్తి సైన్యాన్ని వినియోగించింది. 2018లో అమలు చేసిన డిజిటల్ భద్రతా చట్టం విమర్శకుల గొంతుకను అణిచివేసేందుకు, ముఖ్యంగా ఆన్‌లైన్‌లో భావ ప్రకటనా స్వేచ్ఛను అణచివేయడానికి ప్రభుత్వానికి, అధికార పార్టీ కార్యకర్తలకు శక్తివంతమైన ఆయుధంగా మారింది. పత్రికా స్వేచ్ఛ దెబ్బతినింది. హసీనా తన అధికార స్థానాన్ని సుస్థిరం చేసుకోవడంతో పౌర హక్కులు, క్రమపద్ధతిలో అణచివేసారు. ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతున్న సమయంలోనే ప్రజలమధ్య ఆర్థిక అసమానతలు పెరిగాయి. బ్యాంకు మోసాలు పెరిగాయి. రుణ ఎగవేతదారుల జాబితా పెరిగింది. సిఎల్‌సి పవర్, వెస్టర్న్ మెరైన్ షిప్‌యార్డ్ రెమెక్స్ ఫుట్‌వేర్ వంటి కంపెనీలు దీవాలతీసిన జాబితాలో అగ్రస్థానంలో నిలిచాయి. 965 కోట్ల నుండి 1,649 కోట్ల బంగ్లాదేశ్ టాకాల వరకు మొండి బకాయిలు పెరిగాయి. పెరుగుతున్న ఆర్థిక అసమానతలు, ప్రబలమైన అవినీతి, మొత్తం ఆర్థిక పురోగతి ఉన్నప్పటికీ ప్రజల్లో అసంతృప్తికి ఆజ్యం పోసింది. నియంతలకు ఇది గుణపాఠం కావాలి. ఒంటెద్దు పోకడలతో తీసుకునే నిర్ణయాలు ఎప్పటికైనా ప్రజల్లో తిరుగుబాటుకు కారణమవుతాయి. ప్రజల సంక్షేమాన్ని, అభివృద్ధిని కాదని తీసుకునే నిర్ణయాలు నిలబడవనడానికి బంగ్లాదేశం ప్రత్యక్ష ఉదాహరణ.

# మహిళలకు ఎన్డీఏ సర్కార్ గుడ్ న్యూస్




న్యూఢిల్లీ : ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రారంభించిన ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం అమలుకు కార్యాచరణ చేపట్టింది. లోక్ సభ ఎన్నికల ముందు ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఎన్నికల కోడ్ తో అప్పట్లో అప్లికేషన్లు స్వీకరించినా ప్రక్రియ ముందుకు సాగలేదు. తాజాగా వీటిపై కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. విశ్వకర్మ లోన్ల మంజూరు కార్యాచరణ చేపట్టింది. వివిధ వృత్తుల వారికి యంత్రాలు, పనిముట్లు కొనుగోలు చేసేందుకు కేంద్రం ఆర్థికసాయం అందిస్తుంది.

ఉచితంగా కుట్టు మిషన్లు

మహిళలకు కుట్టు మిషన్ కొనుగోలు చేసేందుకు విశ్వకర్మ పథకంలో ఆర్థికసాయం అందిస్తున్నారు. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకంలో భాగంగా కుట్టుమిషన్ కొనుక్కునేందుకు రూ .15000 అందిస్తారు. ఈ నగదును లబ్దిదారుల ఖాతాల్లో కేంద్రం జమచేస్తుంది. దీంతో పాటు ఒక వారం ట్రైనింగ్ ఇస్తారు. ట్రైనింగ్ సమయంలో రోజుకు రూ.500 చొప్పున చెల్లిస్తారు. కుట్టుమిషన్ కొనుగోలు తర్వాత అతి తక్కువ వడ్డీకి రూ.లక్ష రుణం అందిస్తారు. ఈ లోన్ ను 18 నెలల్లో తిరిగి చెలిస్తే, మరో రూ .2 లక్షల వరకు లోన్ పొందవచ్చు. దానిని 30 నెలల్లో తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. కుట్టు మిషన్ కొనుక్కునే వారు షాప్ పెట్టుకోవడానికి కూడా కేంద్రం లోన్ ఇస్తుంది.

వెరిఫికేషన్

గతంలో కుట్టుమిషన్లకు దరఖాస్తు చేసుకున్న వారి వివరాల వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. ఏపీలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు పీఎం విశ్వకర్మ పథకానికి దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను ఇంటింటికి తిరిగి వెరిఫై చేస్తున్నారు.కుట్టుమిషన్ కోసం దరఖాస్తు చేసుకున్న మహిళలు ఎక్కడ నేర్చుకున్నారు, ట్రైనింగ్ తీసుకున్నారా? గతంలో లోన్లు తీసుకున్నారా? అనే వివరాలు సేకరిస్తున్నారు.

దరఖాస్తు చేసుకునే విధానం

ఉచిత కుట్టుమిషన్ల కోసం అప్లై చేసుకున్న వాళ్లు భారతీయులై ఉండాలి. ఇప్పటికే కుట్టుపనిలో అనుభవం కలిగి ఉండాలి. వయసు 18 ఏళ్లు పైబడి ఉండాలి. దరఖాస్తు చేసుకునేందుకు ఆధార్ కార్డు, అడ్రస్ వివరాలు, గుర్తింపు కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, పాస్ పోర్ట్ సైజ్ ఫొటోతో పాటు బ్యాంకు పాస్ బుక్, మొబైల్ నెంబర్ కలిగి ఉండాలి.ముందుగా https://pmvishwakarma.gov.in/ వెబ్ సైట్ లో రిజిస్ట్రేషన్ చేయాలి. మీకు ఆన్లైన్ రిజిస్ట్రేషన్ తెలియకపోతే దగ్గరలోని మీసేవ కేంద్రానికి వెళ్లి అప్లై చేసుకోవచ్చు. ప్రాసెస్ పూర్తైన తర్వాత వెరిఫికేషన్ చేస్తారు. ఈ ప్రక్రియ పూర్తైన తర్వాత ట్రైనింగ్ కు పిలుస్తారు. ట్రైనింగ్ పూర్తైన తర్వాత సర్టిఫికేట్ ఇస్తారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం మీ బ్యాంక్ ఖాతాలో డబ్బులు వేస్తుంది. ఆ నగదుతో మీరు కుట్టు మిషన్ కొనుగోలు చేయవచ్చు. అనంతరం బ్యాంక్ మీకు లోన్ సదుపాయం కల్పిస్తుంది. అతి తక్కువ వడ్డీకి రూ.3 లక్షల వరకు పీఎం విశ్వకర్మ పథకంలో లోన్ పొందవచ్చు.

### అంత నీచానికి దిగజారలేదు

కుప్పం, తిరుమల శ్రీవారి దర్శనం,పూజ టికెట్లు అమ్ముకునేంత దౌర్భాగ్యం తనకు పట్టలేదని అన్నారు వైఎస్సార్‌సీపీ కుప్పం ఎమ్మెల్సీ కేఆర్‌జే భరత్. తాను ఒక బ్యూరోక్రట్ ఫ్యామిలీ నుంచి వచ్చానని, తన తండ్రి ఒక ఐఏఎస్ అధికారి అని తెలిపారు. ఉన్నత విలువలతో బతికే వ్యక్తినని చెప్పారు. తన వద్ద మల్లికార్జున రావు అనే పీఆర్ఓ ఎవరూ లేరని, అసలు ఆ వ్యక్తి ఎవరో కూడా తెలియదని అన్నారు భరత్. కేవలం కుప్పంలో చంద్రబాబుపై పోటీ చేయడం, అక్కడ ఆయనను ఎదుర్కొంటూ రాజకీయాల్లో నిలబడుతున్నానన్న కక్షతోనే తనపై కేసులు నమోదు చేసి అప్రతిష్టపాలు జేసేందుకు ఈ కుట్ర చేస్తున్నారని మండి

# బంగ్లాదేశ పరిణామాల వెనక విదేశీ హస్తముందా?

బంగ్లాదేశ్:గత కొద్దికాలంగా బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా ప్రభుత్వానికి పరిస్థితులు అంత అనుకూలంగా ఏమీ లేవు. దేశీయంగా ప్రతిపక్ష పార్టీల నుంచి నిరసనలు, ఒత్తిళ్లను ఎదుర్కొంది.విదేశీపరంగా చూసినా, ఇటు భారత్, అటు చైనాతో సత్సంబంధాలు కొనసాగించాలనే ఆమె ప్రభుత్వ విధానం నెరవేరలేదు.

గత నెలలో చైనా పర్యటనకు వెళ్లిన షేక్ హసీనా, పర్యటన ముగియాల్సిన సమయం కంటే ముందే బంగ్లాదేశ్‌కు తిరిగొచ్చేశారు. హసీనా అనుకున్నట్లుగా చైనా పర్యటన జరగలేదని తెలుస్తోంది.చైనాలో షేక్ హసీనాకు తగిన గౌరవం లభించలేదని, జిన్‌పింగ్‌తో సమావేశం కూడా జరగలేదని బంగ్లాదేశ్‌లో భారత మాజీ హైకమిషనర్ వీణా సీక్రి బీబీసీతో చెప్పారు."చైనా ప్రభుత్వం అలా ఎందుకు చేసిందో అర్థం కావడం లేదు. ఎందుకంటే, అంతకుముందు వరకూ బంగ్లాదేశ్‌తో స్నేహపూర్వక సంబంధాలు ఉన్నట్లుగానే చైనా చెబుతూ వచ్చింది, అలాంటి ప్రకటనలే చేస్తూ వచ్చింది" అని వీణా సీక్రి చెప్పారు.ఆమె చైనా నుంచి తిరిగొచ్చిన వెంటనే భారత్‌ను ఉద్దేశించి ఒక పెద్ద ప్రకటన చేశారు. తీస్తా ప్రాజెక్టుపై భారత్, చైనా ఆసక్తిగా ఉన్నాయని, కానీ ఈ ప్రాజెక్టును భారత్ పూర్తి చేయాలని కోరుకుంటున్నట్లు హసీనా చెప్పారు.మరోవైపు భారత్, చైనాలతో షేక్ హసీనా ప్రభుత్వ సంబంధాలపై బంగ్లాదేశ్‌లోనూ ప్రశ్నలు వచ్చాయి.దీనిపై హసీనా మాట్లాడుతూ, "చైనాతో సంబంధాలు బాగానే ఉన్నాయి. ఇంతకుముందు నేను భారత పర్యటనకు వెళ్లినప్పుడు దేశాన్ని భారత్‌కు అమ్మేశానని అన్నారు. చైనా పర్యటనకు వెళ్లినప్పుడు, అక్కడ ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. ఇలాంటి మాటలు వస్తూనే ఉన్నాయి. అలాంటివారు మానసికంగా స్థిరంగా లేరని నేను భావిస్తున్నా" అని ఆమె వ్యాఖ్యానించారు.

రాజకీయ అనిశ్చితి

భారత్, చైనాల గురించి ప్రకటన చేసి నెలరోజులు కూడా కాకుండానే షేక్ హసీనా అధికారం కోల్పోయారు.2024 ఆగస్టు 5వ తేదీ బంగ్లాదేశ్ చరిత్రను మార్చేసింది.అక్కడ కొద్దికాలంగా రిజర్వేషన్లకు వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనలు హింసాత్మకంగా, దేశవ్యాప్త ఉద్యమంగా మారడంతో బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా దేశం విడిచి భారత్‌కు వచ్చారు.సైనిక విమానంలో దిల్లీ సమీపంలోని హిండన్ ఎయిర్‌బేస్‌కు ఆమె చేరుకున్నారు.ఆ తర్వాత షేక్ హసీనాతో భారత జాతీయ సలహాదారు అజీత్ డోభాల్ భేటి అయినట్లు వార్తలొచ్చాయి.మరోవైపు, బంగ్లాదేశ్‌లో తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్మీ చీఫ్ జనరల్ వకార్ ప్రకటించారు.

ఇందులో విదేశీ కోణముందా?

బంగ్లాదేశ్‌లో చెలరేగిన ఈ కల్లోలంపై తలెత్తుతున్న ప్రశ్న ఏంటంటే, దీనంతటికీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనలే కారణమా? లేక మరేవైనా ఇతర కారణాలు ఉన్నాయా?బంగ్లాదేశ్ పరిణామాల వెనక విదేశీ శక్తుల హస్తముందా? అని సోషల్ మీడియాలో చాలామంది ప్రశ్నలు లేవనెత్తుతున్నారు.అయితే, విదేశీ ప్రమేయాన్ని బంగ్లాదేశ్‌లో భారత హైకమిషనర్‌గా పనిచేసిన వీణా సీక్రి ఖండించలేదు.రిజర్వేషన్లలో సంస్కరణల కోసం ప్రారంభమైన ఈ ఉద్యమం ఎలా రూపాంతరం చెందుతుందో చూడాలని, ఈ మార్పు చాలా విషయాలను తెలియజేస్తుందని ఆమె అన్నారు.బంగ్లాదేశ్‌లో పనిచేసిన భారత మాజీ హైకమిషనర్ హర్ష్ శృంగ్లా వార్తా సంస్థ ఏఎన్ఐతో మాట్లాడుతూ, "బంగ్లాదేశ్ విషయంలో విదేశీ శక్తుల ప్రమేయాన్ని తోసిపుచ్చలేం. అలాగే, భారత్ భద్రతా ప్రయోజనాల విషయంలో కూడా.." అని అన్నారు.అయితే, ఈ మొత్తం పరిణామాలకు ఆర్థిక పరిస్థితులే కారణమని హర్ష్ శృంగ్లా భావిస్తున్నారు.కరోనా మహమ్మారి కారణంగా బంగ్లాదేశ్ ఆర్థిక వ్యవస్థకు భారీ నష్టం జరిగింది. ఆ తర్వాత యుక్రెయిన్ సంక్షోభం కారణంగా నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగాయని ఆయన చెప్పారు. బంగ్లాదేశ్ దిగుమతి చేసుకునే ఇంధనం, ఆహార ఉత్పత్తులు, ఎరువుల వంటి వాటిపై ఈ పెరుగుదల ప్రభావం పడిందన్నారు.వీటి కారణంగా బంగ్లాదేశ్ ప్రజలు, ముఖ్యంగా యువత వీధుల్లోకి వచ్చే పరిస్థితి ఏర్పడిందని హర్ష్ అభిప్రాయపడ్డారు.

షేక్ హసీనా, ప్రజలు కోరుకున్నది ఒకటే: వీణా సీక్రి

బంగ్లాదేశ్ నిరసనలను పక్కాగా ప్లాన్ చేసిన వ్యూహంగా వీణా సీక్రి అభివర్ణించారు. రిజర్వేషన్ల విషయంలో విద్యార్థులు, ప్రభుత్వ విధానం ఒకటేనని ఆమె అన్నారు."ఈ రిజర్వేషన్ల ఉద్యమం 2018లో మొదలైంది. అప్పట్లో నిరసనకారుల అన్ని డిమాండ్లను షేక్ హసీనా ప్రభుత్వం ఆమోదించింది. కానీ, దీనిపై జూన్‌లో హైకోర్టులో అప్పీల్‌కు వెళ్లడంతో, కోర్టు రిజర్వేషన్లను సమర్థించింది. అయినప్పటికీ, విద్యార్థులు కోరుకున్నట్లుగా హసీనా ప్రభుత్వం రిజర్వేషన్ల రద్దు కోరుతూ సుప్రీం కోర్టుకు వెళ్లింది" అని ఆమె అన్నారు.ఆ తర్వాత, బంగ్లాదేశ్ సుప్రీం కోర్టు రిజర్వేషన్ విధానాన్ని దాదాపుగా రద్దు



చేసింది.విద్యార్థులు కోరుకున్నదే జరిగింది, దీంతో ఆ తర్వాత విద్యార్థులు వెనక్కి తగ్గినట్లు వీణ చెబుతున్నారు."రిజర్వేషన్లకు సంబంధించిన నిరసనలు ముగిశాయని అనుకుంటున్నా. కానీ ఇప్పుడు జామాత్ ఇ ఇస్లామీ, బీఎన్‌పీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నిరసనలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. చాలా హింస జరిగింది" అని ఆమె అన్నారు.

అక్బర్ హుస్సేన్ విశ్లేషణ ప్రకారం..

ప్రస్తుతం ఏ ప్రభుత్వం ఏర్పాటైనా శాంతిభద్రతల అంశం ఒక పెద్దసవాల్ అవుతుంది. చాలాచోట్ల దోపిడీలు జరుగుతున్నట్లు రిపోర్టులు వస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో శాంతిభద్రతలను కాపాడడం పెద్ద సవాలే.పరిస్థితిని అదుపులోకి తీసుకురావడంలో తాత్కాలిక ప్రభుత్వం కనుక విఫలమైతే, పరిస్థితి మరింత దిగజారుతుందని కొందరు రాజకీయ నిపుణులు అంటున్నారు.అంతా స్పష్టంగా తెలుస్తున్నప్పటికీ, పరిస్థితులను అర్థం చేసుకోవడంలో షేక్ హసీనా విఫలమయ్యారు. అసలేం జరుగుతుందో ఆమెకు అర్థం కాలేదు, లేదంటే దేశంలోని యువత ఏం కోరుకుంటున్నారో అర్థం చేసుకోలేకపోయారు.బంగ్లాదేశ్ యవతకు రాజకీయ అవగాహన ఎక్కువ. రిజర్వేషన్ల సమస్యకు న్యాయం చేయాలని వారు కోరారు.ఇటీవల జరిగిన ఎన్నికల గురించి పాశ్చాత్య దేశాలు ప్రశ్నలు లేవనెత్తాయి. ఎందుకంటే, ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలు తుడిచిపెట్టుకుపోయాయి. మానవ హక్కుల అంశంలోనూ ప్రశ్నలే తలెత్తాయి. కానీ, హసీనా ఎవరి మాటా వినలేదు.

నిరుద్యోగం పెరిగిపోయింది. భావ ప్రకటనా స్వేచ్ఛ లేకుండా పోయింది. వాటితో పాటు యువతలో కోపం, భయం, నిస్పృహ అన్నీ కలిసి వీధికెక్కే పరిస్థితి దాపురించింది.

ప్రజాస్వామ్యం.. సైన్యం..

దేశంలో ప్రస్తుతం తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు బంగ్లాదేశ్ ఆర్మీ ప్రకటించింది. గతంలో బంగ్లాదేశ్‌లో సైన్యం ఆధిపత్యం నడిచింది. కానీ, దశాబ్దాలుగా సైన్యం అధికారంలో లేదు.ఇప్పుడు ఈ నిరసనల అనంతరం తలెత్తిన విపత్కర పరిస్థితుల సమయంలో దేశంలో స్థిరత్వం గురించి సైన్యం మాట్లాడుతోంది. వీటన్నింటిని చూస్తే, సైన్యం ఇలా ముందుకురావడం దేనికి సంకేతం? అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది.అయితే, అధికారం చేజిక్కించుకోవాలని బంగ్లాదేశ్ ఆర్మీ భావిస్తోందని తాను అనుకోవడం లేదంటున్నారు వీణా సీక్రి."ప్రస్తుత పరిస్థితులను అదుపులోకి తీసుకురాగలరు కాబట్టే ఆయన ముందుకొచ్చారు. శ్రీలంకలోనూ అదే జరిగింది. అక్కడ కూడా నిరసనకారులు అధ్యక్షుడి నివాసాన్ని స్వాధీనం చేసుకున్నారు. ముందు ఈ పరిస్థితులను అదుపులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆర్మీ చీఫ్ చెప్పారు. ఆ తర్వాత దేశంలో ఎన్నికలు జరుగుతాయి" అన్నారామె.

భారత్‌పై ఎలాంటి ప్రభావం ఉంటుంది?

షేక్ హసీనా ప్రస్తుతం భారత్‌లోనే ఉన్నారు. పొరుగు దేశంలో తలెత్తిన రాజకీయ ప్రకంపనల ప్రభావం భారత్‌లోనూ కనిపిస్తుంది.దీని ప్రభావం భారత్‌పై ఉంటుందని, భారత్ అక్కడ స్థిరత్వాన్ని కోరుకుంటోందని వీణా సీక్రి అభిప్రాయపడ్డారు."బంగ్లాదేశ్‌తోపాటు ఇరుగుపొరుగు దేశాలు స్థిరంగా ఉండాలని, ప్రజాస్వామ్యబద్ధంగా ఉండాలని భారత్ ఎప్పుడూ కోరుకుంటుంది. భారత్ ఇప్పటికీ దానికి కట్టుబడి ఉంది, స్థిరత్వం కోసం భారత్ ప్రయత్నిస్తుంది" అని ఆమె అన్నారు.రాజకీయంగానే కాకుండా బంగ్లాదేశ్‌తో భారత్‌కు బలమైన వాణిజ్య సంబంధాలు కూడా ఉన్నాయి. దక్షిణాసియాలో భారత్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామి బంగ్లాదేశ్.గత పదేళ్లలో బంగ్లాదేశ్‌లో రోడ్లు, రైల్వేలు, ఓడరేవుల నిర్మాణానికి భారత్ వేల కోట్ల రూపాయలు ఇచ్చింది.ప్రస్తుత అనిశ్చితితో, బంగ్లాదేశ్ పరిణామాలను భారత్ నిశితంగా గమనిస్తోంది.ఆగస్టు 5న ప్రధాని మోదీ తన అధికారిక నివాసంలో బంగ్లాదేశ్ విషయంపై ఉన్నత స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ పాల్గొన్నారు.

# అసమగ్రంగా జివో 33 విడుదల

హైదరాబాద్, కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల మన తెలంగాణ బిడ్డ.. మనకు నాన్ లోకల్ అవుతున్నాడని రేవంత్ రెడ్డి సర్కార్‌పై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. మెడికల్ అడ్మిషన్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేసిన జీవో 33 సమగ్రంగా లేదని పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. మన తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం గుడ్డెద్దు చెనులో పడ్డట్టు ఉంది. రాష్ట్ర భవిష్యత్‌ను, విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని సమగ్ర ఆలోచన లేకుండా అడ్డదిడ్డంగా వ్యవహరిస్తుంది. నిన్న మెడికల్ ఎంబీబీఎస్ అడ్మిషన్ల ప్రక్రియకు నోటిఫికేషన్ వచ్చింది. మన తెలంగాణ విద్యార్థులకు, భవిష్యత్ తరాలకు తీరని నష్టం చేసే విధంగా ఆ నోటిఫికేషన్‌లో నిబంధనలు ఉన్నాయి. అంటే మన పిల్లలే మనకు స్థానికేతరులుగా మారే ప్రమాదం ఉంది. కనీసం అధ్యయనం లేకుండా ఎంబీబీఎస్, బీడీఎస్ అడ్మిషన్లలో ప్రభుత్వం అమలు చేస్తున్న కొత్త నిబంధనలు విద్యార్థుల ప్రయోజనాలు దెబ్బతీసే విధంగా ఉన్నాయని హరీశ్‌రావు పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమం నీళ్లు, నిధులు, నియామకాలు అనే అంశాల మీద జరిగింది. నియామకాలకు సంబంధించి కేసీఆర్ ప్రభుత్వం మన ఆకాంక్షలను నిజం చేసింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగ నియామకాల్లో 60 శాతం లోకల్, 40 శాతం నాన్ లోకల్ రిజర్వేషన్లు ఉండే. 70 శాతం లోకల్, 30 శాతం నాన్‌లోకల్‌గా కూడా నింపేవారు. కానీ కేసీఆర్ శ్రద్ధ పెట్టి ఉద్యోగ నియామకాల విషయంలో రాష్ట్రపతి ఉత్తర్వుల సవరణ చేసి 95 శాతం లోకల్‌కు, 5 శాతం ఓపెన్ కోటాగా నిర్ణయించారు. జీవో నంబర్ 124.. 2018లో విడుదల చేశాం. దీని వల్ల రాష్ట్రంలో ఉద్యోగ నియామకాల్లో 95 శాతం ఉద్యోగాలు స్థానికులకు దక్కేలా రిజర్వేషన్లు సాధించాం. గతంలో 40 శాతం మంది పక్క రాష్ట్రం నుంచి వచ్చి ఓపెన్ కోటాలో ఉద్యోగాలు పొందేవారు. కానీ కేసీఆర్ రాష్ట్రపతి, ప్రధానిని కలిసి 95 శాతం ఉద్యోగాలు తెలంగాణ బిడ్డలకు దక్కేలా సవరణలు చేశారు అని హరీశ్‌రావు గుర్తు చేశారు. విద్యాలయాల్లో ప్రవేశాల విషయంలో కూడా మనం సవరణలు చేసుకోవాల్సి ఉండే. కానీ స్టేట్ రీఆర్గనైజేషన్ యాక్ట్‌లో పదేండ్ల పాటు పాత పద్ధతి యథావిధిగా కొనసాగుతుందని చెప్పారు. అంటే 15 శాతం ఓపెన్ కోటా ఉందో.. ఆంధ్రాలో తెలంగాణ విద్యార్థులు, తెలంగాణలో ఆంధ్రా విద్యార్థులు 15 శాతం ఓపెన్ కోటాలో వెళ్లొచ్చని రాష్ట్ర విభజన చట్టంలో చెప్పారు. కాబట్టి మార్చలేకపోయాం అని హరీశ్‌రావు గుర్తు చేశారు. డాక్టర్ కావాలని చాలా మంది పిల్లలు, వారి తల్లిదండ్రులు కలలు కంటుంటారు. ఆ విధంగా చదివిస్తారు. అలాంటి పిల్లల భవిష్యత్‌తో ఈ రాష్ట్ర ప్రభుత్వం చెలగాటం ఆడుతోంది. 2014కు ముందు తెలంగాణలో మొత్తం 2850 ఎంబీబీఎస్ సీట్లు ఉంటే.. కేసీఆర్ వచ్చాక ఎంబీబీఎస్ సీట్ల సంఖ్యను 9వేలకు పెంచారు. ఈ ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిది. పెంచిన సీట్లు తెలంగాణ బిడ్డలకు దక్కేలా చాలా జాగ్రత్తలు తీసుకున్నాం. తెలంగాణలో 2014లో 20 మెడికల్ కాలేజీల్లో 2850 సీట్లు ఉండే. ఈ సీట్లలో 280 సీట్లు ఓపెన్ కోటాలో ఉండే. కానీ మేం బాగా ఆలోచించి తెలంగాణ వచ్చిన తర్వాత 20గా ఉన్న మెడికల్ కాలేజీల సంఖ్యను 30 మెడికల్ కాలేజీలకు తీసుకెళ్లాం. తెలంగాణ వచ్చిన నాటికి ఉన్న కాలేజీల్లో 15 శాతం ఓపెన్ కోటా పెడుతాం. మేం పెట్టిన కాలేజీల్లో మాత్రం ఓపెన్ కోటా ఇవ్వలేదు.. 100 శాతం మా పిల్లలకు సీట్లు ఇస్తామని చెప్పి జీవో తీసుకువచ్చాం.. దాంతో 520 సీట్లు తెలంగాణ పిల్లలకు అదనంగా దొరికాయి. గుడ్డిగా అదే జీవో ఫాలో అయితే కొత్త కాలేజీల్లో కూడా ఇతర రాష్ట్రాల వారు వచ్చేవారు. రాష్ట్రం ఏర్పడే నాటికి ఉన్న విద్యాలయాల్లో 15 శాతం కోటా ఉంటది.. కానీ తర్వాత ఏర్పడ్డ కాలేజీల్లో మా పిల్లలకు దక్కాలని జీవో సవరణ చేశాం అని హరీశ్‌రావు తెలిపారు. ప్రయివేటు మెడికల్ కాలేజీల్లో బీ కేటగిరి సీట్లు ఉంటాయి. బీ కేటగిరిలో గతంలో దేశంలోని ఎక్కడి వారైనా చదివే అవకాశం ఉండేది. మేం పర్మిషన్ ఇచ్చిన కాలేజీల్లో ఇతరులు చదవడానికి వీల్లేకుండా బీ కేటగిరి సీట్లలో తెలంగాణ పిల్లలకు అడ్మిషన్లు ఇవ్వాలని జీవో సవరించి వెసులుబాటు కల్పించాం. 24 మెడికల్ కాలేజీల్లో బీ కేటగిరి సీట్లలో లోకల్ రిజర్వేషన్లు తేవడంతో 1071 సీట్లు దక్కాయి. తెలంగాణ ఏర్పడ్డ తర్వాత పెట్టిన కాలేజీల్లో 520 ఎంబీబీఎస్ సీట్లు, బీ కేటగిరిలో లోకల్ రిజర్వేషన్లతో 1071 సీట్లు దక్కాయి. తెలంగాణ పిల్లలు డాక్టర్లు కావాలి.. మన పిల్లలకు మేలు జరగాలనే తనపనతో ఈ పని చేశాం. కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఎంబీబీఎస్ అడ్మిషన్లలో అనాలోచితంగా తెలంగాణ పిల్లలకు నష్టం జరిగేలా జీవో తీసుకొచ్చారు అని హరీశ్‌రావు పేర్కొన్నారు. 2024 జూన్ 2వ తేదీ నాటికి రాష్ట్రం ఏర్పడి పదేండ్లు పూర్తి కావడంతో.. తెలంగాణ రాష్ట్రం స్థానికతను నిర్దారించుకునేందుకు సొంత రూల్స్ ఫ్రేమ్ చేసుకునేందుకు అవకాశం దక్కింది. మన పిల్లలకు విద్యా ప్రవేశాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఒక సమగ్రమైన ఆలోచన చేయాల్సిన అవసరం ఉంది. స్థానికతను నిర్దారించేందుకు నియమ నిబంధనలు తయారు చేయాలి. కానీ అలాంటిదేమీ చేయకుండా.. రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ అడ్మిషన్స్ కోసం జీవో నంబర్ 33 ఇచ్చింది. చివరి విద్యాసంవత్సరం నుంచి నాలుగేండ్లు ఎక్కడ చదివితే అక్కడ లోకల్ అని చెప్పారు. అంటే 9 నుంచి 12వ తరగతి వరకు ఎక్కడ చదివితే అది లోకల్ అని పేర్కొన్నారు. ఇది ఆల్రెడీ 1979 జీవోలో ఉంది. 2017 జీవోలో కూడా అదే ఉంది. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన జీవో 33 అసమగ్రంగా ఉంది. ఈ జీవో కారణంగా మన తెలంగాణ బిడ్డలు.. స్థానికేతరులుగా మారే ప్రమాదం ఉందని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# రాజ్యాంగేతర శక్తులుగా రేవంత్ సోదరులు

హైదరాబాద్,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్ తన సోదరులను తెలంగాణ మీదకు వదిలేశారని.. అతని సోదరులకు ఏ పదవులు లేకున్నా రాజ్యాంగేతర శక్తులుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సాక్షాత్తూ అసెంబ్లీ కమిటీ హాల్‌లో రేవంత్ సోదరుడు తిరుపతి రెడ్డి ఏ హోదా లేకున్నా స్పీకర్ దగ్గర వికారాబాద్ రివ్యూ మీటింగ్‌లో పాల్గొన్నారని తెలిపారు. కొడంగల్‌లో తిరుపతి రెడ్డి కల్యాణ లక్ష్మి చెక్కులను పంచుతుంటే తమ జెడ్పిటీస్ మహిపాల్ అడ్డుకున్నారని తెలిపారు. రేవంత్ మరో సోదరుడు కొండల్ రెడ్డికి ఏ హోదా ఉందని అధికారులతో కలిసి ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్నారని ప్రశ్నించారు. రేవంత్ అమెరికా పర్యటనలో స్వచ్ బయోతో రాష్ట్ర ప్రభుత్వం వెయ్యి కోట్ల ఒప్పందం కుదుర్చుకుందని... ఆ కంపెనీ రేవంత్ మరో సోదరుడు ఎనుముల జగదీశ్ రెడ్డిది అని తెలిపారు. పదిహేను రోజుల క్రితమే ఆ కంపెనీ ఏర్పాటయ్యిందని అన్నారు. అవే కాకుండా రేవంత్ సోదరుల ఆధ్వర్యంలో నాలుగు సంస్థలు ఏర్పాటు అయ్యాయన్నారు. ఈ సంస్థల ద్వారానే రేవంత్ బ్లాక్ మనీని వైట్‌గా మారుస్తున్నారని విమర్శలు గుప్పించారు. ప్రధాన కంపెనిలే కాకుండా రేవంత్ సోదరులు అనేక మైక్రో సంస్థల్లో డైరెక్టర్లుగా ఉన్నారన్నారు. రేవంత్ సోదరులు రియల్టర్లను బెదిరించి విచ్చల విడిగా అవినీతికి పాల్పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ వ్యాఖ్యలు చేశారు.

# చేనేతకు అన్ని విధాలుగా అండగా ఉంటా

విజయవాడ, చేనేత కార్మికులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఏపీ సీఎం చంద్రబాబు భరోసా ఇచ్చారు. చేనేతకారులకు ఇచ్చిన అన్ని పథకాలనూ వైకాపా సర్కారు రద్దు చేసిందని మండిపడ్డారు. కార్మికుల ఆదాయం పెరిగేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. విజయవాడలో జాతీయ చేనేత దినోత్సవంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. స్టాళ్లలో ఉత్పత్తులు పరిశీలించి చేనేత కార్మికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా తన సతీమణి భువనేశ్వరికి రెండు చీరలు కొనుగోలు చేశారు. చట్టసభల్లో వెనుకబడిన వర్గాలకు 33శాతం రిజర్వేషన్ల కోసం అసెంబ్లీలో తీర్మానం చేస్తామని ప్రకటించారు. ఇది పార్లమెంటులో చట్టరూపం దాల్చేలా పోరాటం చేస్తామన్నారు. వెనకబడిన వర్గాల్లో అనేక కులాలు ఉన్నాయని, వారి అభ్యున్నతికి కృషి చేస్తానని అన్నారు. నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు న్యాయం చేస్తాం. తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు, స్పీకర్ పదవులను బీసీలకే ఇచ్చాం. మంత్రివర్గంలోనూ అగ్రస్థానం కల్పించిన పార్టీ మాది. బీసీలు.. ఆది నుంచీ పార్టీకి అండగా ఉన్నారు. స్థానిక సంస్థల్లో మళ్లీ రిజర్వేషన్లు తెస్తాం. చేనేత రంగంలో సమగ్ర విధానం తీసుకొస్తాం. చేనేతకారుల్లో నైపుణ్యం పెంచి ఆధునిక శిక్షణ ఇప్పిస్తాం. వారికి ఆరోగ్యబీమా కల్పిస్తాం. చేనేత కార్మికులకు జీఎస్టీ తొలగించేందుకు ప్రయత్నిస్తాం. జీఎస్టీ తొలగించకుంటే రియంబర్స్ చేస్తాం అని ప్రకటించారు. నేతన్నలకు రూ.67 కోట్లు ఇచ్చి న్యాయం చేస్తాం. నేతన్నలు సామూహికంగా పనిచేసే విధానానికి శ్రీకారం చుడతాం. చేనేత మగ్గాల కోసం రూ.50వేలు సాయం చేస్తాం. ప్రజలంతా చేనేత వస్త్రాలు ధరించాలి. చేనేత పరిశ్రమను కాపాడటం మన బాధ్యత. నెలకు ఒకరోజైనా చేనేత వస్త్రాలు ధరించాలని పిలుపునిస్తున్నానని అన్నారు. చేనేత వస్త్రాలకు ఆన్‌లైన్ మార్కెటింగ్‌ను ప్రోత్సహిస్తాం. చేనేత మరమగ్గాల కార్మికులకు, సౌర విద్యుత్ ప్యానెళ్ల ద్వారా ఉచిత విద్యుత్ అందిస్తాం. చేనేత కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తాం. పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా చేనేతలో సహజ రంగులను ప్రోత్సహిస్తాం అని చంద్రబాబు తెలిపారు. ఏపీలో ఏ శాఖలో చూసినా దోపిడీ, విధ్వంసం, అవినీతి, వ్యవస్థల నిర్వీర్యమే కనబడుతోంది. గతంలో ఎన్నడూ ఇలా జరగలేదు. ఏనాడూ ఇన్ని ఇబ్బందులు చూడలేదు. వ్యవస్థ పూర్తిగా భ్రష్టుపట్టి.. నిర్వీర్యమైంది. ఇబ్బందులు ఉన్నాయని ఇచ్చిన హామీలను వదిలిపెట్టలేదు. తొలి రోజే ఐదు సంతకాలు పెట్టాను. క్యాబినెట్‌లో పెట్టి నిర్ణయాలు చేసి అమలు చేస్తున్నాం. వైకాపా నేతలు ఐదేళ్లలో ప్రజల భూములు, ఆస్తులు కొట్టేశారు. రికార్డులు తారుమారు చేసి పేదలను అనేక ఇబ్బందులు పెట్టారని చంద్రబాబు మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు తీసుకొస్తామని చెప్పారు. అట్టడుగు వర్గాలను ఆర్థికంగా, రాజకీయంగా , సామాజికంగా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. చట్టసభల్లో వెనుకబడిన తరగతుల వారికి 33శాతం రిజర్వేషన్ల కోసం పార్లమెంట్‌లో చట్టం కోసం ప్రయత్నిస్తామని అన్నారు. రాబోయే నామినేటెడ్ పోస్టులోనూ బీసీలకు న్యాయం చేస్తామన్నారు.మెగా డీఎస్సీలో 16347 ఉద్యోగాలు ఇవ్వబోతున్నామని తెలిపారు. ల్యాండ్ అండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేశామని తెలిపారు. ఈనెల 15న 100 అన్న క్యాంటీన్లు ప్రారంభిస్తున్నామని తెలిపారు. అన్నదానం చేసే దాతలు అన్న క్యాంటీన్లు ఉపయోగించుకోవాలని సూచించారు. యువత నైపుణ్యం పెంచడానికి స్కిల్ సెంటర్లు ప్రారంభిస్తామని అన్నారు. ప్రయత్నాలతో ఆర్థిక అసమానతలు తొలగించడం సాధ్యమేనని అన్నారు. చేనేత కార్మికుల ఆరోగ్య బీమా కోసం రూ.10 కోట్లు మంజూరు చేస్తానని అన్నారు.

# కంటైనర్లలో గిరిజన విశ్వవిద్యాలయం!



విజయనగరం: ఇవి కేవలం ఈ ముగుర్గి సమస్యలు మాత్రమే కాదు. ఈ యూనివర్సిటీని సందర్శించిన 'ప్రజాశక్తి' ఎదుట ఒడిశాకు చెందిన అబీబ్స్, కేరళకు చెందిన రిన్నూ బీజో సహా ఎంతోమంది విద్యార్థులు తమ సమస్యలు ఏకరువుపెట్టారు. గదులు, హాస్టల్, అధ్యాపకుల కొరత మాత్రమే కాదు%%. ఆట స్థలం, వివిధ రంగాలపై పరిశోధనలకు స్థలం, మౌలిక సదుపాయాలు లేకపోవడం వంటి ఎన్నో సమస్యలు ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యమే ఇందుకు కారణమన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రాష్ట్ర విభజన చట్టంలో భాగంగా 2014లో విజయనగరం జిల్లాకు మంజూరు చేసిన ఈ యూనివర్సిటీకి సొంత గూడు కల్పించడంలో రకరకాల కుంటిసాకులతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నెట్టుకొచ్చింది. 2019 ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు యూనివర్సిటీ ఏర్పాటుకు అనుమతులు ఇచ్చినప్పటికీ శాశ్వత భవనం ఏర్పాటు చేయలేదు. వర్సిటీ స్థాయికి తగ్గట్టు కోర్సులు ప్రవేశపెట్టలేదు. ఉన్న కోర్సులకు తగినంత అధ్యాపకులను నియమించలేదు. ఈ నేపథ్యంలో విజయనగరం మెడికల్ కళాశాలకు సమీపంలోని ఎయుకి చెందిన భవనంలో 120 అడ్మిషన్లతో నాడు ప్రారంభమైంది. ప్రస్తుతం 434 మంది విద్యార్థులు ఉన్నారు. తరగతి గదుల సమస్యతో వరండాలను సైతం తరగతి గదులుగా మార్చారు. కంటైనర్లలో లేబొరేటరీలు ఏర్పాటు చేశారు. అధునాతన పరికరాలు ఉన్నా వాటిని వినియోగంలోకి తీసుకురాలేని పరిస్థితి ఉందని అధ్యాపక బృందం ఆవేదన వ్యక్తం చేస్తోంది. విలువైన పుస్తకాలు ఉన్నా ప్రత్యేకించి లైబ్రరీ లేదు. విద్యార్థుల ఆటపాటలకు స్థలం, వ్యాయామశాల కరువవడంతో అంతా కలిసిమెలిసి ఉండడం, ఉల్లాసంగా, ఉత్సాహంగా గడపడం వంటివి మచ్చుకు కూడా కనిపించని దుస్థితి వర్సిటీలో నెలకొంది. అధ్యాప కులుఅంతంత మాత్రమే: వర్సిటీలో ప్రస్తుతం ఎంఎ ఇంగ్లీష్, ఎంఎ సోషియాలజీ, ఎంఎ ట్రైబల్ స్టూడెంట్స్, ఎంఎస్‌సి బయోటెక్నాలజీ, ఎంఎస్‌సి కెమిస్ట్రీ, మాస్టర్ ఆఫ్ జర్నలిజం, మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్, మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్ వంటి ఎనిమిది పోస్టుగ్రాడ్యుయేట్ కోర్సులతోపాటు మరో ఆరు అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులు ఉన్నాయి. సాధారణంగా ప్రతి పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుకు కనీసం ప్రొఫెసర్, ఇద్దరు అసోసియేట్ ప్రొఫెసర్లు, నలుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు చొప్పున ఏడుగురు ఉండాలి. ఈ లెక్కన 98 మంది అధ్యాపకులు అవసరం. 18 మంది మాత్రమే పర్మినెంట్ అధ్యాపకు లు ఉన్నారు. మిగిలిన 80 మంది గెస్ట్ లెక్చరర్లు. వీరిలో 30 మంది మాత్రమే నేరుగా తరగతి గదుల్లో చదువులు బోధిస్తున్నారు. మిగిలిన 50 మంది దూరదృశ్య తరగతులు నిర్వహిస్తున్నారు. పోస్టుల భర్తీకి కేంద్ర విద్యాశాఖ మీనమేషాలు లెక్కిస్తోంది. ఇదీ శాశ్వత నిర్మాణలకు నిధుల పరిస్థితి: 2019 సాధారణ ఎన్నికలకు ముందు కొత్తవలస మండలం రెల్లి రెవెన్యూ పరిధిలో 526 ఎకరాలను యూనివర్సిటీ కోసం అప్పటి టిడిపి ప్రభుత్వం కేటాయించింది. హడావుడిగా ప్రహరీ నిర్మాణం చేపట్టింది. ఆ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల సరిహద్దులోని మెంటాడ మండలం చినమేడపల్లి రెవెన్యూ పరిధిలోకి స్థలాన్ని మార్పు చేసింది. ఇందుకోసం 561.88 ఎకరాలను సేకరించింది. 2023 ఆగస్టు 25న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రెండోసారి శంకుస్థాపన చేశాయి. వర్సిటీ నిర్మాణానికి రూ.834 కోట్లు కేటాయించినట్టు శంకుస్థాపనకు వచ్చిన అప్పటి సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, అప్పటి కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రకటించారు. 2027 నాటికి ఈ పనులు పూర్తి చేసేందుకు మినిస్ట్రీ ఆఫ్ స్టీల్ అండర్‌లోని మెకాన్ ఇండియా కంపెనీ ఒప్పందం కుదుర్చుకుని పనులు చేపట్టింది. రూ.305 కోట్ల వ్యయంతో ఫేజ్-1 పనులు చేపట్టారు. ప్రస్తుతం చాలా వరకు భూమి చదును చేయడం పూర్తయింది. మట్టి, నీటి పరీక్షలు పూర్తి చేశారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఆధ్వర్యాన వాటర్ ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణ పనులు దాదాపు చివరి దశకు వచ్చాయి. భవన నిర్మాణాలకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. యూనివర్సిటీ నిర్మాణ స్థలాన్ని కొత్తవలస మండలం రెల్లికి మార్పు చేయాలంటూ జిల్లాకు చెందిన కొంతమంది అధికార పార్టీ ఎమ్మెల్యేలు ప్రభుత్వాన్ని కోరారు. ఈ నేపథ్యంలో యూనివర్సిటీ నిర్మాణం ఎప్పటికి పూర్తవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. యూనివర్సిటీ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి తమ సమస్యలు పరిష్కరించాలని, పూర్తి స్థాయిలో అధ్యాపకులను నియమించాలని విద్యార్థులు కోరుతున్నారు.

## లోకేశ్ చర్యలతో మంచి రోజులు

విజయవాడ, జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున కార్యక్రమాలు జరుగుతున్నాయి. రాజకీయ ప్రముఖులంతా చేనేత దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మంగళగిరిలో జరిగిన చేనేత దినోత్సవంలో టీడీపీ ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చేనేతలకు మంత్రి నారా లోకేష్ తన సొంత నిధులతో 27 రకాల సంక్షేమ పథకాలను అందించారన్నారు. వారి జీవితాల్లో నూతన వెలుగు రేఖలు తీసుకొచ్చారన్నారు. నూతన సాంకేతిక నైపుణ్యాలను పరిచయం చేసి వారి ఆదాయం పెంపునకు కృషి చేశారని అనురాధ తెలిపారు.అధునాతన రాట్నాలు, మగ్గాలు ఉచితంగా అందించారని పంచుమర్తి అనురాధ తెలిపారు. చేనేత వస్త్రాలకు అంతర్జాతీయ బ్రాండింగ్ తెచ్చారన్నారు. అందుకే లోకేష్ ను 91,413 భారీ ఓట్ల మెజారిటీతో గెలిపించారన్నారు. చేనేత రంగానికి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు నారా లోకేష్ కృషి చేస్తున్నారని పంచుమర్తి అనురాధ తెలిపారు. వర్షం కారణంగా సీఎం చంద్రబాబు చీరాల పర్యటన రద్దు అయ్యింది. నేడు చీరాలలో జరిగే చేనేత దినోత్సవంలో ఆయన పాల్గొనాల్సి ఉంది. కానీ వర్షం కారణంగా ఇది రద్దయ్యింది. చంద్రబాబు విజయవాడలో జరిగే చేనేత కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇక జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని పెడనలో చేనేత తయారీ మగ్గాలను జిల్లా కలెక్టర్ బాలాజీ , పెడన శాసన సభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ పరిశీలించారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని ఆగస్టు 7న దేశవ్యాప్తంగా ప్రతి ఏట నిర్వహిస్తారు. భారత స్వాతంత్యోద్యమములో ప్రధాన భూమిక పోషించి, స్వాతంత్య్ర సమపార్జనకు ఒక సాధనంగా నిలిచింది

# నిండుకుండలా సాగర్ జలాశయం

నాగార్జునసాగర్, శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్ జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. దాంతో సాగర్ డ్యామ్ 22 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా.. ప్రస్తుత నీటి మట్టం 584.50 అడుగులకు చేరుకుంది. పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 295.99 టీఎంసీల నీరు నిలువ ఉంది.మరోవైపు శ్రీశైలం జలాశయానికి కూడా వరద భారీగా కొనసాగుతోంది. జలాశయం 10 గేట్లను 12 అడుగుల మేర ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశంయ ఇన్ ఫ్లో 2,74,443 క్యూసెక్కులు కాగా.. ఔట్ ఎ÷-లో 3,72,053 క్యూసెక్కులుగా ఉంది. పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుత నీటిమట్టం 883.20 అడుగులు. పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.8070 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 205.6627 టీఎంసీల నీరు నిలువ ఉంది. మరోవైపు సూర్యాపేట జిల్లాలోని పులిచింతల ప్రాజెక్టు ఇన్ ఎ÷-లో 3,05,200 క్యూసెక్కులు కాగా.. ఔట్ ఫ్లో 20,000 క్యూసెక్కులుగా ఉంది. పులిచింతలకు ఎగువ నుంచి వస్తున్న వరద 3 లక్షల 27 వేల క్యూసెక్కులు. దాంతో విద్యుత్ ఉత్పత్తి కోసం పది వేల క్యూసెక్కుల నీటిని మళ్లించారు. పులిచింతల పూర్తి నిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ప్రాజెక్టులో 26.79 టీఎంసీల నీరు నిలువ ఉంది. వరద మరింత పెరగనుండటంతో పులిచింతల దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచించారు.

# భద్రాచలంలో రెండ్రోజులుగా భారీ వర్షం

భద్రాద్రి కొత్తగూడెం,ఇరిగేషన్ అధికారులపై మంత్రి తుమ్మల నాగేశ్వరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రామాలయం అన్నదాన సత్రం వద్ద వరద నీరు నిలవడంపై మండిపడ్డారు. మంత్రి ఆదేశాలను గోదావరి నది కరకట్ట స్లూయిజ్ లాక్‌లను ఎత్తి పట్టణంలోని వర్షపు నీటిని గోదావరిలోకి ఇరిగేషన్ అధికారులు విడుదల చేశారు. ఈ క్రమంలో ఉదయం నుంచి నీటిలో మునిగి వున్న రామాలయ ప్రాంతం వాసులకు ఉపశమనం కలిగన్లటైంది. కాగా.. గోదావరి నీటిమట్టం 33 అడుగులు ఉండటంతో లాక్‌లను అధికారులు ఎత్తివేశారు. మళ్లీ గోదావరి ప్రవాహం 36 అడుగులకు చేరితేనే లాకులను మూసివేయనున్నారు.కాగా.. భద్రాచలంలో ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురుస్తోంది. ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యంతో రామాలయం పరిసర ప్రాంతాల్లో వరద నీరు పోటెత్తింది. పట్టణంలోని వర్షపు నీరు డ్రైయినేజ్ నీరు మోటార్లతో ఎత్తిపోయక పోవడంతో వరద నీరు నిలిచిపోయింది. దేవస్థానం ఆలయం అన్నదాన సత్రంలోకి చేరిన వరద నీరు చేరింది. దీంతో అన్నదానం సత్రాన్ని మూసివేశారు. భక్తులకు పాకెట్‌ల ద్వారా అన్నదానానికి ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. గోదావరి నది కరకట్ట స్లూయిజ్‌ల నుండి వర్షపు నీటిని పంప్ చెయ్యకపోవడంతోరామాలయ ప్రాంతం నీట మునిగింది. విషయం తెలిసిన మంత్రి తుమ్మల.. అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో గోదావరి నది కరకట్ట స్లూయిజ్ లాక్‌లను ఎత్తి పట్టణంలోని వర్షపు నీటిని గోదావరిలోకి విడుదల చేయడంతో రామాలయ ప్రాంతం వాసులకు ఉపశమనం కలిగింది. మరోవైపు.. భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానానికి అనుబంధంగా ఉన్న శ్రీ కుసుమ హరినాథ్ బాబా మందిరంలో ఈశాన్య మండపానికి బీటలు వారాయి. భారీ వర్షాల కారణంగా ఈశాన్యం మండపం కూలడానికి సిద్ధంగా ఉంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండప అడుగుభాగం పూర్తిగా దెబ్బతిన్నది. కింద భాగం పెచ్చులు ఊడి కింద పడటంతో తృటిలో భారీ ప్రమాదం తప్పింది. విషయం తెలిసిన వెంటనే జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అక్కడకు చేరుకుని సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మండపాన్ని పూర్తిగా తీసివేసి పరిస్థితి చక్కదిద్దాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఎటువంటి ప్రమాదం జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు జిల్లా కలెక్టర్ పాటిల్ ఆదేశాలు జారీ చేసింది.

# బీజేపీ మౌనమేల?

హైదరాబాద్, తెలుగు రాష్ట్రాల్లో హాట్ టాపిక్ గా మారిన ఎస్సీ వర్గీకరణ అంశంపై బీజేపీ ఎందుకు నోరు మెదపడం లేదు ? మొదటి నుంచి వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని పదే పదే చెప్పిన తెలంగాణ నేతలు.. తీరా సుప్రీం గ్రీన్ సిగ్నల్ ఇచ్చాక.. సైలెంట్ అయిపోవడం పట్ల ఆంతర్యం ఏంటి? వర్గీకరణ అంశంలో ఇంకేమైనా లొసుగులు ఉన్నాయా..? వర్గీకరణ అంశంపై దూరంగా ఉండాలని నేతలకు హైకమాండ్ నుంచి ఆదేశాలు వచ్చాయా ?రాష్ట్రాలు ఎస్సీ కులాల ఉపవర్గీకరణ చేసుకోవచ్చంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రక తీర్పు కేంద్రంలోని ఎన్డీయేను కుదిపేస్తోంది. ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని.. వర్గీకరణ సాధించేందుకు తమ వంతుగా శ్రమిస్తామని.. ప్రధాని మోడీ పార్లమెంట్ ఎన్నికలకు ముందు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ సాక్షిగా హామీ ఇచ్చారు. మాదిగ సామాజిక అభివృద్ధికి అవసరమైన ఆర్థిక విధానాలు మెరుగు పరిచేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. వర్గీకరణను లీగల్ గా ఎదుర్కొనేందుకు అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఇచ్చిన మాట మేరకు మోడీ కేంద్ర కేబినెట్ సెక్రటరీ ఆధ్వర్యంలో కమిటీని కూడా నియమించారు.కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. కమిటీ నివేదికతో పాటు ప్రభుత్వ ఆలోచనను కూడా పరిగణలోకి తీసుకుని వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఇక ఈ తీర్పుతో ఎన్నికల సందర్భంగా మోడీ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని బీజేపీ వర్గాలో చర్చ జరుగుతోంది. అయితే ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు వెల్లడించిన తీర్పుపై బీజేపీ నేతలు ఎలాంటి వ్యాఖ్యలు చేయకపోవడం తీవ్ర చర్చకు దారి తీస్తోంది.బీజేపీ అధిష్టానం ఇచ్చిన ఆదేశాలతోనే.. తెలంగాణ నేతలు వర్గీకరణ అంశంపై గప్ చుప్ అయ్యారని టాక్. వర్గీకరణను స్వాగతిస్తున్నామంటూ ఎవరికి వారు ముందుగా మీడియాకు ప్రకటనలు కూడా ఇచ్చి.. ఆ తర్వాత కొద్దిసేపటికే గ్రూపుల్లో ప్రకటనలు తొలగించారని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఆ మెసేజ్ లను తొలగించడం వెనుక హై కమాండ్ ఆదేశాలు ఉన్నాయని భావిస్తున్నారు. వర్గీకరణపై పాజిటివ్ గాను.. నెగిటివ్ గాను ఎలాంటి కాంట్రవర్సీ చేయొద్దని రాష్ట్ర నాయకత్వానికి హైకమాండ్ సూచనలు చేసినట్లు పొలిటికల్ వర్గాల్లో చర్చించుకుంటున్నారు.వర్గీకరణ అంశంపై పాజిటివ్ గా మాట్లాడితే.. మిగతా వర్గాలకు అది నెగెటివ్ అయ్యే అవకాశం ఉండటంతో.. ముందు జాగ్రత్త చర్యలు చేపట్టినట్టు తెలుస్తోంది. అందుకే నేతలు సైలెంట్ గా ఉండాలని దిశానిర్దేశం చేసినట్లు చెబుతున్నారు. అగ్ర నాయకత్వం ఆదేశాలతో వెంటనే కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారని అంటున్నారు. వర్గీకరణ అంశంపై ఏ ఒక్క నేత మాట్లాడకూడదని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి.వర్గీకరణ అంశం ఒక సామాజిక సమస్య కావడంతో.. ఆ విషయాన్ని రాజకీయ కోణంతో చూడొద్దని స్పష్టం చేసినట్టు టాక్ నడుస్తోంది. వర్గీకరణపై సుప్రీం తీర్పుతో ఎవరికైనా అన్యాయం జరుగుతుందని భావిస్తే.. వారిపై కేంద్రం సానుకూలంగా స్పందించి న్యాయం చేసేందుకు సిద్ధంగా ఉందనే భరోసాను కల్పించాలని సూచనలు చేసినట్టు చెబుతున్నారు.

# అనివార్యమేనా?

పశ్చిమాసియా నివురుగప్పిన నిప్పులా, ఏ క్షణమైనా బద్దలయ్యే అగ్నిపర్వతంలా ఉంది. ఇజ్రాయెల్‌పై హమాస్ రాకెట్ దాడులతో పది నెలల కిందట భగ్గుమన్న పశ్చిమాసియాలో పరిస్థితులు అంతకంతకు జటిలమవుతున్నాయి. ఇటీవల ఇద్దరు హమాస్ అగ్ర నేతలతో పాటు హెజ్బొల్లా సీనియర్ మిలిటరీ కమాండర్‌ను ఇజ్రాయెల్ మట్టుబెట్టడంతో ప్రతీకారానికి ఇరాన్ కత్తులు నూరుతోంది. హమాస్ సైనిక విభాగాధిపతి మహమ్మద్ డెయిఫ్‌ను గాజాలో మట్టుబెట్టిన ఇజ్రాయెల్, అంతకు ఒక రోజు ముందు ఆ సంస్థ చీఫ్ హనియాను పథకం ప్రకారం హత్య చేసింది.తమ దేశ రాజధాని టెహరాన్‌లోకి ఏజెంట్లను పంపించి, హనియా బస చేసిన హోటల్ గదిలో బాంబులు అమర్చి మరీ హతమార్చుడని ఇరాన్ తేలిగ్గా తీసుకోలేకపోతోంది. 'ఇక ఇప్పుడు ప్రతీకారం తీర్చుకోవడం మా బాధ్యత' అంటూ ఇరాన్ సుప్రీం కమాండర్ అయతొల్లా ఖమేనీ చేసిన ప్రకటనతో యుద్ధం అనివార్యమనే సంగతి స్పష్టమైపోయింది. అది నీడ, రేప అనేది తేలవలసి ఉందంటే. సిరియా రాజధాని డమాస్కస్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయంపై ఇజ్రాయెల్ మూడు నెలల క్రితం దాడులు నిర్వహించడంతో ప్రతీకారంగా ఇరాన్ కూడా ఇజ్రాయెల్‌పై రాకెట్ దాడులు జరిగాయి. అయితే అవి పరిమిత దాడులు మాత్రమే. పశ్చిమాసియాలో పూర్తిస్థాయి యుద్ధాన్ని కోరుకోవడం లేదని అప్పట్లోనే స్పష్టం చేసింది ఇరాన్, ఈసారి హనియా హత్యతో ఇజ్రాయెల్‌పై తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమవుతోంది.ఇరాన్ విరుచుకుపడక తప్పదన్న సంగతి గ్రహించిన అమెరికా మిత్రదేశానికి అండగా ఇప్పటికే ఫైటర్ జెట్ విమానాలను, యుద్ధనౌకలను తరలించి మిత్రదేశానికి అండగా నిలబడింది. మరో వైపు ఇరాన్ కూడా మద్దతు కూడగట్టేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది. రష్యా, చైనాల సహకారంకోసం పావులు కదుపుతోంది. ప్రస్తుత పరిణామాలను త్రైపాక్షిక కూటమిగా ఎదుర్కోవాల్సిన అవసరాన్ని చెప్పవలసి ఉంటుంది వాటి సహాయాన్ని కూడగట్టుతోంది. ఇందులో భాగంగా రష్యా జాతీయ భద్రతా మండలి కార్యదర్శి తాజాగా ఇరాన్‌ను సందర్శించి, ఆ దేశాధ్యక్షుడితో భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది.ఇరాన్, లెబనాన్, సిరియా దేశాల సహాయ సహకారాలతో ఇజ్రాయెల్‌పై హమాస్, హెజ్బొల్లా ఉగ్రవాద సంస్థలు ఎన్నో ఏళ్లుగా దాడులు జరుగుతున్నాయి.హమాస్-ఇజ్రాయెల్ మధ్య ప్రత్యక్ష యుద్ధం మొదలయ్యాక హెజ్బొల్లా సైతం అడపాదడపా ఇజ్రాయెల్ భూభాగాలపై రాకెట్ దాడులకు దిగుతోంది. తాజాగా తమ మిలిటరీ కమాండర్‌ను మట్టుబెట్టడంతో భగ్గుమన్న హెజ్బొల్లా ఇజ్రాయెల్‌తో ప్రత్యక్ష దాడులకు దిగేందుకు ప్రణాళిక రచించనుంది. ఈసారి హెజ్బొల్లా మిలిటరీ దాడులకు పరిమితం కాబోదన్న ఇరాన్‌పై సామాన్య పౌరులపైనా సదరు ఉగ్రవాద సంస్థ దాడులకు తెగబడుతుందన్న హెచ్చరికలు దాగి ఉండటం కలవరం కలిగిస్తోంది. ఇరు దేశాల మధ్య యుద్ధం తలెత్తినప్పుడు జననష్టం జరగరాదన్నది యుద్ధనీతి.దీనికి ఇజ్రాయెల్ ఏనాడో తిలోదకాలిచ్చిందనడానికి గాజాలో రోజూ వందల సంఖ్యలో బలవుతున్న అమాయక జనమే ఉదాహరణ. ఇక హెజ్బొల్లా, హమాస్ వంటి ఉగ్రవాద సంస్థలకు నీతి సూత్రాలు, యుద్ధ నియమాలు వర్తిస్తాయనుకోవడం అత్యాశే. కాబట్టి ఈసారి ఇజ్రాయెల్‌పై ముప్పేట దాడి మొదలైతే, ఆ దేశంలో కూడా జనహననం తప్పదన్నమాట. హమాస్- ఇజ్రాయెల్ మధ్య కాల్పుల విరమణకు జరుగుతున్న సంధి ప్రయత్నాల్లో కీలక పాత్ర పోషిస్తున్న హనియాను ఇజ్రాయెల్ మట్టుపెట్టడంతో మధ్యవర్తులైన ఖతార్, ఈజిప్టు దేశాల ప్రతినిధులు విస్తుపోయారు. ఇక చర్చలు ముందుకు ఎలా సాగాలని వారు నిస్పృహ వ్యక్తం చేస్తున్నారు. ఇజ్రాయెల్‌కు, హమాస్, హెజ్బొల్లా, ఇరాన్‌కూ మధ్య యుద్ధం తలెత్తితే, ఇక దానిని ఏ శక్తి అడ్డుకోలేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. పశ్చిమాసియాలో రగులుతున్న ఉద్రిక్తతల కారణంగా పలు దేశాలు టెహ్రాన్,

# కష్టాల్లో ఉన్న బంగ్లాదేశ్‌కు భారత్ ఎంతవరకు సాయం చేయగలదు?

న్యూఢిల్లీ,బంగ్లాదేశ్‌కు సుదీర్ఘకాలం ప్రధానమంత్రిగా పనిచేసిన షేక్ హసీనా నాటకీయ పరిణామాల మధ్య రాజీనామా చేసిన వెంటనే భారత్ బయలుదేరడం...రెండు దేశాల మధ్య ఉన్న సన్నిహిత సంబంధాలకు నిదర్శనం.17కోట్ల జనాభా ఉన్న బంగ్లాదేశ్‌ను షేక్ హసీనా సుదీర్ఘకాలం పరిపాలించారు.సివిల్ సర్వీసు ఉద్యోగాల్లో కోటాను ఎత్తివేయాలంటూ మొదలైన ఆందోళనలు విస్తృత రూపం దాల్చి.. ప్రభుత్వ వ్యతిరేక హింసాత్మక ఉద్యమంగా మారేంతవరకు హసీనా పాలన సాగింది.

జూన్‌లో రెండు సార్లు భారత్‌కు హసీనా

హసీనా పదవీచ్యుతురాలు కావడానికి ముందు ఈ ఏడాది జూన్‌లో రెండు సార్లు భారత్‌లో పర్యటించారు. అది కూడా రెండు వారాల వ్యవధిలోనే ఆమె దిల్లీకి రెండు సార్లు వచ్చారు.తొలి పర్యటనలో భారత ప్రధాని నరేంద్రమోదీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హసీనా హాజరయ్యారు.తర్వాత ఆమె రెండోసారి భారత్‌కు వచ్చినప్పుడు రెండు రోజుల పాటు పర్యటించారు.మోదీ మూడోసారి ప్రధాన మంత్రి అయిన తరువాత భారత్‌లో పర్యటించిన తొలి విదేశీ పాలకులు హసీనాయే.

"గత ఏడాది కాలంలో మేం 10 సార్లు సమావేశమయ్యాం. ఈ సమావేశం ప్రత్యేకమైనది. మా ప్రభుత్వం మూడోసారి ఏర్పడిన తర్వాత తొలి అతిథి షేక్ హసీనా కావడం ఇందుకు కారణం" అని ప్రధాని మోదీ అప్పటి సంయుక్త మీడియా సమావేశంలో అన్నారు.రెండు దేశాల మధ్య సంతోషకరమైన స్నేహబంధం ఉంది. "భారత్‌తో సంబంధాలకు బంగ్లాదేశ్ ఎంతో విలువ ఇస్తుంది. మేం ఏం చేశామో, ఏం చేయబోతున్నామో చూడడానికి బంగ్లాదేశ్ రండి" అని షేక్ హసీనా ఆ సంయుక్త సమావేశంలో అన్నారు.బంగ్లాదేశ్‌తో భారత్‌కు ప్రత్యేక అనుబంధం ఉంది. రెండు పొరుగు దేశాలు 4,096కిలోమీటర్ల మేర సరిహద్దును కలిగి ఉన్నాయి.భాష, సాంస్కృతిక, ఆర్థిక అంశాల్లో గట్టి సంబంధాలున్నాయి. 1971లో పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధం తర్వాత బంగ్లాదేశ్ ఆవిర్భవించింది.పాకిస్తాన్ నుంచి విడిపోకముందు బంగ్లాదేశ్ ప్రాంతాన్ని తూర్పు పాకిస్తాన్‌గా పిలిచేవాళ్లు. ఆ యుద్ధంలో భారత్ బెంగాలీలకు మద్దతుగా నిలిచింది. రెండు దేశాల మధ్య దాదాపు 1600 కోట్ల డాలర్ల విలువైన ద్వైపాక్షిక వాణిజ్యం ఉంది.అయితే రెండు దేశాల మధ్య సంబంధాల విషయంలో అంతా బాగుందని చెప్పడానికి లేదు.బంగ్లాదేశ్‌కు చైనాతో ఉన్న దగ్గరి సంబంధాలపై గతంలో రెండు దేశాల మధ్య విభేదాలు నెలకొన్నాయి.సరిహద్దు భద్రత, వలసదారుల సమస్యలు వంటివాటితో పాటు మోదీ హిందూ జాతీయవాద రాజకీయాలపై కొందరు బంగ్లాదేశ్ నాయకులు, అధికారుల్లో అసంతృప్తి ఉంది.షేక్ హసీనా ప్రధాని పదవికి రాజీనామా చేసిన తర్వాత మధ్యంతర ప్రభుత్వం ఏర్పడుతుందని చెప్పిన బంగ్లాదేశ్ ఆర్మీ చీఫ్‌కు భారత్‌తో సంబంధాలు లేవు.తాజా పరిణామలకు ముందు.. బంగ్లాదేశ్‌లో జరిగిన హింసాత్మక అల్లర్లను ఆ దేశ అంతర్గత సమస్యలుగా భారత్ అభివర్ణించింది.షేక్ హసీనా రాజీనామా చేయడం, బంగ్లాదేశ్‌ను వీడడం భారత్‌కు అంత మంచి పరిణామం కాదని.. ఆమెకు, ఆమె పార్టీకి అక్కడ ప్రత్యామ్నాయం రావడం తమకు ఏమాత్రం అనుకూలం కాదన్నట్లుగా భారత్ చాలాకాలంగా చూస్తోందని అమెరికన్ థింక్-టాంక్ విల్సన్ సెంటర్‌కు చెందిన మైఖేల్ కుగల్‌మాన్ విశ్లేషించారు.తమ ఆందోళనలు గురించి భారత్ బంగ్లాదేశ్ ఆర్మీకి తెలియజేయొచ్చని, మధ్యంతర ప్రభుత్వ ఏర్పాటులో భారత్ అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలన్న ఆకాంక్ష కనబరచొచ్చని మిస్టర్ కుగల్‌మ్యాన్ బీబీసీతో చెప్పారు.

'బంగ్లాదేశ్ పరిణామాలను భారత్ నిశితంగా పరిశీలిస్తుంది.



దేశంలో స్థిరమైన పరిస్థితులు ఏర్పడేందుకు వీలుగా స్వేచ్ఛగా, పారదర్శకంగా ఎన్నికలు జరపడానికి సహకరిస్తుంది.కానీ బీఎన్‌పీ అధికారంలోకి రావాలని భారత్ కోరుకోకపోవచ్చు. బీఎన్‌పీ బలహీనపడినప్పటికీ ఆ పార్టీ అధికారంలోకి రావాలని భారత్ కోరుకోదు. సుదీర్ఘకాలం మధ్యంతర ప్రభుత్వం కొనసాగడాన్ని కూడా దిల్లీ వ్యతిరేకించకపోవచ్చు' అని ఆయన చెప్పారు.షేక్ హసీనా రాజకీయ జీవితం అకస్మాత్తుగా తలకిందులు కావడం ఆమె అనుయాయులను ఆత్మరక్షణలో పడేసింది.బంగ్లాదేశ్ పితామహుడి కూతురైన షేక్ హసీనా, ఓ దేశానికి ఎక్కువకాలం ప్రధానిగా పనిచేసిన మహిళా నాయకురాలు. 20 ఏళ్లకు పైగా ఆమె బంగ్లాదేశ్ ప్రధానిగా పనిచేశారు. ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా బంగ్లాదేశ్‌ను ఆమె నిలిపారు. దక్షిణాసియాలో జీవన ప్రమాణాల పెంపులో కీలకంగా వ్యవహరించారు.

వివాదాస్పదంగా నాలుగోసారి ఎన్నిక

జనవరిలో జరిగిన వివాదాస్పద ఎన్నికలో వరుసగా నాలుగోసారి హసీనా గెలుపొందారు. ప్రతిపక్ష బీఎన్‌పీ ఓటింగ్‌ను బహిష్కరించింది. ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందని ఆరోపించింది. బీఎన్పీ నేతలు, మద్దతుదారుల అరెస్టులు భారీస్థాయిలో జరిగాయి.బంగ్లాదేశ్ ఆందోళనల్లో భారత్ వ్యతిరేక అభిప్రాయం కనిపించడంతో హసీనా ప్రభుత్వానికి భారత్ మద్దతిచ్చిందని, ఆ దేశ అంతర్గత రాజకీయాల్లో ఇది జోక్యం చేసుకోవడమేనని విమర్శకులు విశ్లేషించారు.ఆరోపణలు అతిగా వ్యాపించడం, చారిత్రక విషాదాలు కూడా కొంత వ్యతిరేక భావన కలగజేస్తాయి.'14 ఏళ్లగా హసీనా ప్రభుత్వానికి కీలక మద్దతుదారుగా ఉండి.. ఆ దేశంలో ప్రజాస్వామ్యం క్షీణించడంలో కొంత పాత్ర పోషించిన భారత్ ఇప్పుడిలా మౌనంగా ఉండడం ఏమాత్రం ఆశ్చర్యం కలిగించడంలేదు' అని ఇల్లినాయిస్ స్టేట్ యూనివర్శిటీలో బంగ్లాదేశ్-అమెరికన్ రాజకీయ శాస్త్రవేత్త అలీ రియాజ్ చెప్పారు.

ఇప్పుడేం చేయాలి..?

బంగ్లాదేశ్ ప్రతిపక్షాన్ని, దాని మిత్రపక్షాలను ప్రమాదకర ఇస్లాంశక్తులుగా భారత్ భావిస్తోంది.బంగ్లాదేశ్ కేంద్రంగా పనిచేసే భారత వ్యతిరేక తీవ్రవాద గ్రూపులను హసీనా సమర్థంగా అణచివేశారు. బంగ్లాదేశ్‌తో సరిహద్దు ఉన్న ఐదు రాష్ట్రాలకు వాణిజ్యపరంగా భద్రమైన పరిస్థితులు కల్పించేందుకు రవాణా అనుమతులు మంజూరుచేశారు."భారత్ ఉద్దేశం ప్రకారం శాంతియుత, స్థిరమైన, సుసంపన్నమైన బంగ్లాదేశ్ ఉండాలి. అలాంటి పరిస్థితులు ముఖ్యంగా శాంతి, సుస్థిరత ఉండడానికి భారత్ ఏమైనా చేయాల్సిందే" అని భారత మాజీ విదేశాంగ కార్యదర్శి, బంగ్లాదేశ్ హై కమిషనర్ హర్షవర్ధన్ ష్రింగ్లా..హసీనా రాజీనామా చేయడానికి కొన్ని గంటలముందు బీబీసీతో చెప్పారు.ప్రస్తుతం హసీనాకు ఆశ్రయం కల్పించడానికి మించి భారత్ ఏం చేసినా బంగ్లాదేశ్ అంతర్గత వ్యవహారాలలో జోక్యం చేసుకున్నట్లు అవుతుంది.

